

కష్టాల బోధన

- ఉపాధ్యాయులపై తీవ్ర పనిభారం
- అందాల్సినవీ సక్రమంగా అందని వైనం

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తీవ్ర పని ఒత్తిడితో ఆందోళనకు గురవుతున్నారు. బోధన కంటే ఇతర పనుల భారం ఎక్కువ కావడంతో మానసికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన జీతాల నుంచి మిగిలిన అన్ని సౌకర్యాల్లోనూ కోతలు విధిస్తున్నారు. చివరకు ప్రతి నెలా జీతాలకు సైతం రోజులు తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరు పట్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో 8,747 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు. బోధన కంటే ఇతర పనుల భారం వీరిపై అధికం కావడంతో గత రెండు, మూడేళ్లుగా చాలామంది ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడితో బాధపడుతున్నారు. సమయానికి కనీసం జీతాలు కూడా సర్కారు ఇవ్వకపోవడంతో ఆర్థికంగానూ అవస్థలు పడాల్సి వస్తోంది. విద్యార్థులకు బోధన విషయంలో ఎంత ఒత్తిడినైనా ఆనందంగా స్వీకరించే గురువులపై యాప్‌లు, జిఇఆర్‌లు, ముఖ గుర్తింపుతో అదనపు భారం పెంచేయడంతో కుంగిపోతున్నారు. ఉపాధ్యాయులకు అందించే జీతాల నుంచి అన్ని సౌకర్యాల్లోనూ ప్రభుత్వం విపరీతంగా కోతలు విధిస్తోంది. ఇంటి అద్దెలోనూ కోత వేశారు. ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఎ) కూడా 20 శాతం ఉంటే 16 శాతానికి, 15 శాతం ఉన్న వాళ్లకు 12 శాతానికి, 12 ఉన్న వాళ్లకు 10 శాతానికి తగ్గించారు. నగరాలు, మున్సిపాల్టీలు, గ్రామాల్లో పని చేసే వారందరికీ గతంలో ఉన్న హెచ్‌ఎస్‌ఎలో కోత వేశారు. ఉదాహరణకు రూ.15 వేల హెర్‌ఆర్‌ఎ ఉంటే అది రూ.12,500కు తగ్గిపోయింది. ఉపాధ్యాయులు ఇఎల్‌ను సరెండర్ లీవుగా చేసుకుని డబ్బుగా మార్చుకుంటారు. అయితే ఉపాధ్యాయులకు గత ఏడాదిన్నర నుంచి సరెండర్ లీవు క్యాష్ మంజూరైనా బ్యాంకు ఖాతాల్లో మాత్రం డబ్బులు పడలేదు. (రూ.50 వేల జీతం ఉన్న ఉపాధ్యాయులు 15 రోజులు సరెండర్ లీవులు పెడితే రూ.25 వేల వరకూ డబ్బులొస్తాయి.) ఒక ఉపాధ్యాయుడికి జీతాన్ని బట్టి ఎన్ని రోజులు సెలవులు సరెండర్ చేస్తే అంత జీతం అదనంగా ఇస్తారు. ఇవేమీ పూర్తిస్థాయిలో వస్తున్న పరిస్థితి లేదు.

హాజరుకు అష్టకష్టాలు

ప్రస్తుతం ఉపాధ్యాయులకు వారి మొబైల్ ఫోన్లలోనే ముఖగుర్తింపు యాప్‌ను అప్‌లోడ్ చేశారు. అయితే ఉదయం, సాయంత్రం దీనిలో హాజరు వేసుకోవడం తలకు మించిన భారంగా మారుతోంది. ఒకేసారి ఉపాధ్యాయులంతా హాజరు వేసుకునేందుకు ప్రయత్నిస్తుండడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. కనీసం 20 నిమిషాలు ప్రయత్నిస్తేనే హాజరు పడుతోంది. ఏమాత్రం పడకపోయినా షోకాజ్ నోటీసులు వస్తున్నాయని గురువులు వాపోతున్నారు. పాఠశాల వదిలేసిన తర్వాత కూడా అక్కడే ఉండి హాజరు వేసుకుని వెళ్లేందుకు సెల్‌ఫోన్లతో కుస్తీలు పడుతున్నారు.

యాప్‌లతో మరింత పని ఒత్తిడి

మధ్యాహ్న భోజనం యాప్‌లో ప్రతిరోజూ వండిన ఆహార పదార్థాలను ఉపాధ్యాయుని ఫొటోతో సహ అప్‌లోడ్ చేయాలి. గురువులకు ఇప్పుడు ఇదొక భారం. ఆహారం సరిగా లేకపోతే అప్‌లోడ్ చేసిన వాళ్లే బాధ్యులు. మరుగుదొడ్ల నిర్వహణ ఫండ్ (టిఎంఎస్) యాప్‌లో ప్రతిరోజూ పాఠశాలలోని మరుగుదొడ్లు, మూత్రశాలల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పని చేసే ఈ యాప్‌లో ఒక్కోసారి అంతా బాగున్నా బాగోలేదంటూ చూపిస్తోందని, షోకాజ్ నోటీసులు వస్తున్నాయని గురువులు వాపోతున్నారు. వివిధ రకాల పనులతో సతమతమవుతూ పని భారంతో నెలంతా పని చేస్తున్నా ప్రతినెలా ఇచ్చే జీతాల కోసం ఉపాధ్యాయులు రోజులు తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ప్రతి నెలా ఉత్పన్నమవుతోంది. ఆగస్టుకు సంబంధించిన జీతాలు సెప్టెంబరు 12వ తేదీ దాటినా పూర్తిస్థాయిలో పడలేదు. జూన్ 10వ తేదీతో ఉపాధ్యాయుల బదిలీలు ముగిశాయి. ఉమ్మడి జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు గత మూడు, నాలుగు నెలలుగా జీతాలందలేదు.

బోధనేతర పనులను అప్పగించరాదు



ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించరాదు. ఇప్పటికే ఉపాధ్యాయులకు బోధన అంశాలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు దృష్టి సారించడం లేదు. యాప్‌లలో పలు వివరాల నమోదు పేరుతో బోధనకు ఆటంకం ఏర్పడుతోంది. ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక బకాయిలను విడుదల చేయాలి.

- జయరాజు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.

ఫలించని పోలీసు వ్యూహం

- దేవరగట్టులో పగిలిన తలలు.. చిందిన రక్తం... - 105 మందికి గాయాలు
- 11 మంది పరిస్థితి విషమం - చెట్టు కొమ్మ విరిగి ఒకరు మృతి
- తొక్కిసలాటలో మరో ఇద్దరు మృతి - నిఘా నేత్రంలో నాట్యమాడిన కర్రలు

ప్రజాశక్తి - హోళగుంద

పోలీసు వ్యూహాలు, ఎత్తుగడలు ఫలించలేదు. గట్టుపై భక్తులు పట్టు వదల్లేదని మరోసారి రుజువైంది. నిఘా నేత్రాలు ఉన్నప్పటికీ కర్రలు నాట్యమాడాయి. జైత్రయాత్రలో పాల్గొన్న 105 మంది భక్తులకు, రింగ్ కర్రలు, అగ్ని దివిటీల ఆవిరి తగిలి గాయాలయ్యాయి. 11 మంది పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఆలూరు, ఆదోని ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. చెట్టు కొమ్మ విరిగి ఆస్పరికి చెందిన గణేష్ (17) మృతి చెందారు. బన్నీ ఉత్సవం తొక్కిసలాటలో ఊపిరాడక ఆలూరు మండలం ములగవెల్లి కొట్టాలకు చెందిన రామాంజనేయులు (42), బళ్లారికి చెందిన ప్రకాష్ (28) మృతి చెందారు.



కర్నూలు జిల్లా హోళగుంద మండలం నెరణికి, నెరణికి తండా, కొత్తపేట కొండ గుహల్లో వెలసిన దేవరగట్టు శ్రీమాల మల్లేశ్వర స్వామి జైత్రయాత్ర (కర్రల సమరం) మంగళవారం అర్ధరాత్రి జరిగింది. వేలాది సంఖ్యలో పోలీసు బలగాలు ఉన్నప్పటికీ కర్రలు దేవరగట్టుకు రాకుండా ఆపలేకపోయారు. అవగాహన సదస్సులు, రింగ్ కర్రలు స్వాధీనం చేసుకున్నప్పటికీ రక్త గాయాలు, ఊపిరాడక మృతి చెందిన సంఘటనలు కళ్లకు కట్టినట్టు కనబడ్డాయి. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. నివారించడంలో విఫలమయ్యారు.

జైత్రయాత్ర (కర్రల సమరం) మొదలైంది ఇలా..!

శ్రీమాల మల్లేశ్వరస్వామి జైత్రయాత్రను కొనసాగించేందుకు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు అర్ధరాత్రి 12 గంటల సమయంలో పాల బండకు చేరుకున్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో కలిసికట్టుగా ఉండాలని, పాత కక్షలు పెట్టుకోకూడదని పాల బాస చేసుకున్నారు. అనంతరం మూడు అవుట్లు వదిలి 'డు ర్రా గో పరాక్.. మాల మల్లేశ్వర బహు పరాక్' అంటూ నినాదాలు చేసి ఏకతాటిపై మాల మల్లేశ్వర సన్నిధికి చేరుకున్నారు. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా యుద్ధ వాతావరణాన్ని తలపించింది. అక్కడి నుంచి కొండ గిరిపైకి వెళ్లి, ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీమాల మల్లేశ్వరులకు వివాహం జరిపించారు. అనంతరం జైత్రయాత్రలో భాగంగా శ్రీమాల మల్లేశ్వరుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆ సమయంలో విగ్రహ మూర్తులను దక్కించుకోవాలని అరికెర, బిలేహాళ్, ఆలూరు, కురుకుంద, ముద్దనగేరి, కరిడిగుడ్డం, సులువాయి, ఎల్లార్తి, హెబ్బటం, నిద్రపట్టి, విరుపాపురం తదితర గ్రామాల భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు. అప్పుడు ఒకరినొకరు కొట్టుకొని అగ్గి దివిటీలు సెగలు తగిలి 82 మందికి గాయాలయ్యారు. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారికి స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక వైద్యశాలలో చికిత్స అందించారు. ఎక్కువ గాయాలైన వారిని మెరుగైన వైద్యం కోసం వైద్యాధికారులు రెఫర్ చేశారు.

రాక్షస పడవద్ద గొరవయ్య రక్తం చిందించింది ఇలా...

జైత్రయాత్ర ఆగకుండా చరిత్ర పుటల్లో చెప్పిన విధంగా గొరవయ్య తన తొడ పిక్కల నుంచి రక్తాన్ని చిందించాడు. అక్కడి నుంచి ఎదురు బసవన్న గుడి వద్దకు చేరుకుని భవిష్య వాణి వినిపించారు. అక్కడి నుంచి సింహాసన కట్టకు వెళ్తుండగా మరోసారి ఇరువురు భక్తుల కర్రల నాట్యమాడగా మరో 33 మందికి గాయాలయ్యాయి. శ్రీమాల మల్లేశ్వర విగ్రహ మూర్తులు సింహాసన కట్టకు చేరడంతో ఉత్సవం ముగిసింది. అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. అడిషనల్ ఎస్పీ ఒకరు, 9 మంది డీఎస్పీలు, 66 మంది సిఐలు, 1000 మంది పోలీసులు, 48 స్పెషల్ పార్టీ బృందాలు, రెండు ఎపిఎస్‌పి బలగాలు, 185 మంది హోంగార్డులు బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, హోళగుంద తహశీల్దార్ హుస్సేన్ సాబ్, పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, దేవరగట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మీడియాపై పోలీసుల ఆంక్షలు

దేవరగట్టులో స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక వైద్యశాలలో గాయాలైన భక్తుల ఫొటోలు, వీడియో కవరేజీ కోసం వెళ్లిన మీడియాపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఎస్పీ ఆదేశాల మేరకు 'ఏ మీడియా కూడా లోపలికి వెళ్లకూడదు' అంటూ పోలీసులు మీడియాపై దురుసుగా ప్రవర్తించారు. గతంలో ఎప్పుడూ, ఏ పోలీసు బాసులు కూడా ఇలాంటి నిబంధనలు విధించలేదు. ఇలాంటి ఆంక్షలు విధించడం మీడియాకు సంకెళ్లు వేసినట్లు అవుతుందని విలేకరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పునరావృతం కాకుండా చూడాలన్నారు.



బందోబస్తుపై చర్చిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

'ప్రజారక్షణ భేరి'ని జయప్రదం చేయండి

- అసమానతలు లేని అభివృద్ధి జరగాలనే సిపిఎం ప్రణాళికను బలపరచండి
- సిపిఎం జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఈ నెల 30న జిల్లాలో జరిగే ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ పేర్కొన్నారు. సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.నిర్మల, పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, కెవి.నారాయణలతో కలిసి బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధి జరగాలని కోరుతూ సిపిఎం ప్రత్యామ్నాయ ప్రణాళికను రాష్ట్రంలో విడుదల చేసిందని తెలిపారు. సిపిఎం తన ప్రత్యామ్నాయ ప్రణాళికలో రూ.400కే గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలని, రూ.60కే పెట్రోల్, డీజిల్ ఇవ్వాలని, పెన్షన్లు రూ.5వేలు ఇవ్వాలని, మెగా డిఎస్‌సి విడుదల చేసి 4 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, మధ్య తరహా పరిశ్రమలకు, యాజమాన్యాలకు ప్రభుత్వాలు రాయితీలు ఇవ్వాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, పెండింగ్ ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని, స్వామినాథన్ సిఫారసులు అమలు చేసి రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, రసాయనక ఎరువుల ధరలు అదుపు చేయాలని, చదువుకున్న నిరుద్యోగులకు రూ.ఐదువేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని పేర్కొన్నదన్నారు. వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, భూమిలేని నిరుపేదలకు రెండున్నర ఎకరాల భూమి ఇవ్వాలని, కౌలు రైతులకు కౌలు రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని, రచయితలపై, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, లౌకిక తత్వాన్ని కాపాడాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి నిధులు కేటాయించాలని ప్రణాళికలో పెట్టడం జరిగిందని తెలిపారు. దీంతో పాటు కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సంవత్సరానికి రూ.10,000 కోట్లు విడుదల చేయాలని, జిల్లాలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు తక్షణమే పూర్తి చేయాలని, కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, ఓర్వకల్‌లో ప్రకటించిన పారిశ్రామిక హబ్‌లో ఐటీ, ఫార్మా, స్టీల్ ఇండస్ట్రీస్ నిర్మించాలని ప్రణాళికలో పెట్టడం జరిగిందన్నారు. పై అంశాల సాధన కోసం సిపిఎం రాబోయే కాలంలో పోరాటం చేస్తుందని,అందులో భాగంగా ఈ ఈ నెల 30 నుంచి రక్షణభేరి యాత్ర మూడు కేంద్రాల నుండి బయలుదేరుతుందని ఆయన తెలిపారు. 30న ఉదయం 10 గంటలకు ఆదోనిలో బస్సు యాత్ర ప్రారంభమవుతుందని ప్రారంభ సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలె, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో వేలాది మందిని సమీకరించి నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ బహిరంగ సభకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతున్నారని తెలిపారు. **పత్తికొండ**లోని ఈశ్వర్ రెడ్డి భవన్‌లో ప్రజారక్షణభేరి గోడ పత్రికలను విడుదల చేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు దస్తగిరి, గోపాలు మాట్లాడారు. ఈనెల 30న జరిగే బస్సు యాత్రలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, మధుబాబు, వ్యకాస మండల కార్యదర్శి నరసన్న, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు పి.కాశి, బురుజుల రాముడు, ఆవాజ్ మండల కార్యదర్శి తాజ్ మహమ్మద్, ఆటో కార్మిక సంఘం నాయకులు ప్రభాకర్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, నిర్మల వేదికపై నాయకులు



చంద్రబాబును అక్రమ కేసులతో వేధించొద్దు

సుప్రీంకోర్టు ఆదేశాలివ్వాలి : టిడిపి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును అక్రమ కేసులతో వేధించకుండా సుప్రీంకోర్టు ఆదేశాలివ్వాలని తెలుగుదేశం పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. కర్నూలు టిడిపి కార్యాలయం ఎదురుగా న్యాయం ఒకవైపు.. అన్యాయం మరోవైపు ఫ్లెక్సీలు కట్టుకొని టగ్గాఫ్ వార్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిజి.భరత్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. నేతలంతా న్యాయం, అన్యాయం ఫ్లెక్సీలు తాడుకు కట్టుకొని లాగుతూ నిరసన తెలిపారు. టిజి.భరత్ మాట్లాడుతూ చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేసి జైలులో పెట్టారన్నారు. సుప్రీంకోర్టులో చంద్రబాబు వేసిన క్వాష్‌పిటిషన్ ద్వారా న్యాయం జరుగుతుందని అనుకుంటున్నట్లు చెప్పారు. ఈ కేసులో క్వాష్ పిటిషన్ ద్వారా న్యాయం జరిగినప్పటికీ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు ప్రజల్లో ఉండకుండా అన్యాయంగా చాలా కేసులు పెట్టి జైలులో పెట్టొచ్చన్నారు. అందుకే చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి వేధించకుండా.. ఆయనకు ఉపశమనం ఇచ్చేలా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వాలన్నారు. టిడిపి నేతలు నాగరాజు యాదవ్, పరమేశ్, సోమిశెట్టి నవీన్, జూటూరు రవి, అబ్బాస్, సత్రం రామక్రిష్ణుడు, గున్నామార్క్, తిమ్మోజీ, రాజ్ కుమార్, సుంకన్న, రామాంజనేయులు, అఖిల్‌పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా చేయకండి : పిపిఎస్ఎస్

ప్రజాశక్తి-కర్నూలు



కార్పొరేషన్ : ఆర్‌టిసి బస్టాండ్ వెనక రూ.కోటికి పైగా ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన మీసేవ కేంద్రాన్ని ఎలా మూసేస్తారని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ(పిపిఎస్ఎస్) సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, నగర నాయకులు ఎ. వెంకటేశ్వర్లు, లక్ష్మణ గౌడ్ అధికారులను ప్రశ్నించారు. బుధవారం సంఘం ప్రతినిధి బృందం ఆ ప్రాంతంలో పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకప్పుడు ఎంతో ఆదరణ పొందిన మీసేవ కేంద్రాన్ని మూసివేసి బందెలదొడ్డిగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. మీసేవ కేంద్రాన్ని మూసివేయడంతో అందులో రూ.50లక్షల విలువ గల పరికరాలు, ఫర్నిచర్ తుప్పు పట్టి పోతుందన్నారు. ప్రజాధనం వృధాపై ప్రజాప్రతినిధులు ,అధికారులు స్పందించాలని కోరారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్లు నెలకు ఒకసారి కూడా ఈ ప్రాంతంలో అడుగు పెట్టడంనందువల్ల చెత్త పేరుకొని పోయి దుర్వాసన వస్తుండడంతో ఆ రోడ్డుపై ప్రజలు వెళ్లడం మానేశారన్నారు. కమిషనర్ ఈ ప్రాంతంలో పర్యటించి మీసేవ కేంద్ర భవనంలో వార్డు కార్యాలయం లేదా శానిటరీ కార్యాలయం ఏర్పాటు చేసి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు.

మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

పాఠశాల పరిసరాల్లో మత్తు పదార్థాలు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ నుండి వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా అధికారులు , వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల తనిఖీల్లో భాగంగా సి.బెళగల్ మండలం, బురాన్ దొడ్డి -2 లోని ప్రభుత్వ పాఠశాల పరిధిలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు ఈ నెల 16న తెలిసిందన్నారు. ఈ అంశానికి సంబంధించి చర్యలు తీసుకోవడంలో డిఇఒ, ఎంఇఒ, పాఠశాల ప్రధానోపా ధ్యా యుడు అలసత్వం వహించారని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పిల్లలు చదివే పాఠశాలల్లో ఇలాగే జరిగితే చూస్తూ ఊరికే ఉంటారా అని కలెక్టర్ అధికా రులను ప్రశ్నించారు. పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలైతే ఎవరు బాధ్యులని కలెక్టర్ ప్రశ్నించారు. ఈ అంశంపై కలెక్టర్ జిల్లా ఎస్పీతో ఫోన్ లో మాట్లాడారు.. సంబంధిత పాఠశాలలో జరుగుతున్న విషయాన్ని ఎస్‌పికి వివరించి, చర్యలు తీసు కోవాల్సిందిగా కలెక్టర్ ఎస్‌పికి సూచించారు.... సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్ తో కూడా ఫోన్ లో మాట్లాడి ఈ అంశంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన రిపోర్టు కాపీని పంపాలని హెడ్మాస్టర్ ను ఆదేశించారు. ప్రతి బుధవారం పాఠశాలలు, వసతి గృహాల్లో మహిళా పోలీస్, సంక్షేమ కార్యదర్శులు తనిఖీల్లో లేవనెత్తిన అంశాలను పరిష్కరించడంలో కౌతాళం, పెద్దకడుబూరు మండలాలు వెనుకబడి ఉన్నా యన్నారు, బిసి, ఎస్‌సి కెజిబివి వసతి గృహాల్లో సరైన దుప్పట్లు ఉన్నాయా లేదా అని తనిఖీ చేయాలని మండల స్థాయిలో ఎంపిడి ఓలను, జిల్లా స్థాయిలో బిసి సంక్షేమ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులను, పిఒ ఎస్ఎస్ఎను ఆదేశించారు.. దుప్పట్ల అవసరం ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సమకూరుస్తామని కలెక్టర్ తెలిపారు. రాబోయే చలికాలం లో ఏ ఒక్క విద్యార్థి చలితో బాధపడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. తుగ్గలి మండలం, జొన్నగిరి పాఠశాలలో లింగ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పుస్తకాలు అందించలేదని గుర్తించా రన్నారు. సంబంధిత అంగన్వాడీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసి తిరిగి అలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఐసిడిఎస్ పిడిని ఆదేశించారు. జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, సిపిఒ అప్పలకొండ, హౌసింగ్ ఇంఛార్జి పిడి సిద్ధలింగమూర్తి, పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, ఎస్ఎస్ఎ, పిఒ వేణు గోపాల్, డిఇఒ రంగారెడ్డి, సెట్కూరు సిఇఒ రమణ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గోరక్షణ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ఎంపి , ఎమ్మెల్యే, మేయర్ హాజరు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

గో సంరక్షణ కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కర్నూలు జిల్లా గోరక్షణ మహా సంఘం నూతన చైర్మన్ ఆది మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం కర్నూలు గోరక్షణశాలలో చైర్మన్ పి.ఆదిమోహన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు విజయభాస్కర రెడ్డి, శేషయ్య, ఎం.శకుంతల, జిఎం కవిత, వై.పార్వతమ్మ, జవహర్లాల్ బాబు ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా కర్నూలు ఎంపి డాక్టర్ సంజీవ్‌కుమార్, కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఏ.హఫీజ్ ఖాన్, నగర మేయర్ బివై రామయ్య హాజరయ్యారు. హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ... ఎలాంటి కల్మషం లేని సాధు జీవులు గోవులని, పరోపకారం తప్ప అన్య ఆలోచనలు లేనివవి అన్నారు. నోరులేని జీవులు అంటే తనకు అత్యంత ప్రేమ అన్నారు. అన్ని కులాలను మతాలను సాంప్రదాయాలను తాను గౌరవిస్తానని అన్నారు. మతాల పేరుతో కొంతమంది చిచ్చుపెట్టడానికి ఎంత ప్రయత్నించినా ఇక్కడి ప్రజలు వాటిని తిరస్కరించారన్నారు. కరోన కష్టకాలంలో గోవులను ఎవరు పట్టించుకోకపోతే తాను ప్రత్యేకంగా లక్షలు ఖర్చుపెట్టి గ్రాసాన్ని తెప్పించి గోవులకు పెట్టామన్నారు. ఇది నాకు అత్యంత సంతృప్తిని ఇచ్చిందన్నారు. భారతదేశంలో అతి పవిత్రమైన జంతువుగా గోవును సాంప్రదాయంగా గౌరవిస్తారన్నారు. ఎంపీ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ గోశాల అనుబంధంగా కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం రూ.25 లక్షలు ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి మంజూరు చేస్తున్నానని ప్రకటించారు. వైసిపి కర్నూలు నియోజకవర్గ అబ్జర్వర్ కర్ర హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆది మోహన్ రెడ్డి మరింత ఉన్నతంగా ఎదగాలని కోరారు. నూతన చైర్మన్ ఆదిమోహన్ రెడ్డి మాట్లాడుతూ... తనకు ఈ పదవి దక్కడంలో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ ప్రధాన పాత్రను పోషించారని, ఈ రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేనని భావోద్వేగానికి లోనయ్యారు. గోరక్షణ శాల అభివృద్ధితోపాటు దాని అనుబంధంగా ఉన్న వివిధ ఆస్తులను పరిరక్షించడానికి కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పలువురు పూలమాలలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు. వైసిపి నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు గడ్డం రామకృష్ణ, బంగి అనంతయ్య, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, ఇఒ మాట్లాడారు. వైసిపి సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కేదార్నాథ్, 52వ వార్డు ఇన్‌ఛార్జి కృష్ణశర్మ అధ్యక్షత వహించగా కార్పొరేటర్లు విజయలక్ష్మి షాషావలి, కోఆప్షన్ మెంబర్లు శ్రీరాములు, నయీమ్ పాషా, చాట్ల నవీన్, తదితర వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఛైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి, సభ్యులు

నీలం రామేశ్వరరావు అనారోగ్యంతో మృతి

నేడు బొల్లవరంలో అంత్యక్రియలు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్



కల్లూరు మండలం బొల్లవరం గ్రామానికి చెందిన నీలం రామేశ్వరరావు(76) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. 1947 జులై ఒకటిన ఆయన జన్మించారు. కర్నూలు కోల్స్ హై స్కూలులో ఎస్ఎస్ఎల్ సి, గద్వాలలో డిగ్రీ పూర్తి చేశారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడు 1975 ప్రాంతంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కర్నూలు జిల్లా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. కర్నూలు నగరంలో విద్యార్థి సంఘానికి పునాదులు వేసిన ప్రథములలో ఆయనొకరు. జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరి అంచలంచలుగా పదోన్నతులు పొందుతూ నందికొట్కూరు, బనగానపల్లె, ఎమ్మిగనూరు, కర్నూలు తదితర వ్యవసాయ మార్కెట్ యార్డులలో విధులు నిర్వహించారు. కర్నూలు వ్యవ సాయ మార్కెట్ గ్రేడ్ 2 సెక్రటరీగా పదవీ విరమణ పొందారు. బొల్లవరం వామపక్ష ఉద్యమాల పురిటి గడ్డ, స్వాతంత్ర ఉద్యమంలోనూ, విప్ల వోద్యమంలోను అగ్రభాగాన నిలిచిన గ్రామం. ఈ ఉద్యమాలకు ఊపిరి పోసింది నీలం కుటుంబం. నీలం రామచంద్రయ్య తమ్ముని కుమారుడు రామేశ్వర రావు చిన్ననాటి నుండి వామక్ష భావాలు కలిగిన వారు. విద్యార్థి ఉద్య మంలో చురుకుగా పాల్గొన్నారు. తర్వాతి కాలంలో ఉద్యోగ రీత్యా వ్యవసాయ మార్కెట్లో పని చేశారు. ఆయనకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. అందరూ వివిధ వృత్తులలో స్థిరపడ్డారు. నీలం రామేశ్వరరావు అంత్యక్రియలు స్వగ్రామం బొల్లవరంలో నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు నీలందినకర్ తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి సంతాపం

వామపక్ష భావజాలం కలిగి ఉండి, ఆభావజాలాన్ని ముందుకు నడిపించే వారికి సహకరించిన నీలం రామేశ్వరరావు మృతి బాధాకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామేశ్వరరావు మంచి పుస్తక ప్రియులు. మార్క్సిస్టు సాహిత్య పఠనం నిత్యం చేసేవారన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రఘాడ సానుభూతిని ప్రకటించారు.

ఎల్లెల్సీ 4/7 నుంచి కోడుమూరుకు 90 క్యూసెక్కులు ఇవ్వాలి

ప్రజాశక్తి -కోడుమూరు : వర్షాభావ పరిస్థితుల వలన గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి ఎల్ఎల్‌సి 4/7 కాలువ కింద కోడుమూరు నియోజకవర్గ పొలాలకు రావాల్సిన వాటా 90 క్యూసెక్కులనీటిని వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ కోరారు. గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామం వద్ద గల ఎల్లెల్సీ 4/7 కాలువను నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ బుధవారం పరిశీలించారు. నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడుతూ నీటిని వెంటనే వదిలితే ఈ సంవత్సరం ఖరీఫ్ పంట కోత దశకు వచ్చాయని , రబీలో సాగు చేసిన రైతన్న పొలాల్లో పంటలు ఎండిపోకుండా కాపాడిన వారమవుతామని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలలోని రైతు పొలాలకు 10 రోజులపాటుగా సాగునీరు అందించవచ్చని, ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు ఇక్కడ ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

ఆదోని మండలాన్ని కరువుగా ప్రకటించాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు



రాస్తారోకో చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి, కరువు సాయక చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. రైతుసంఘం, వ్యకాస ఆధ్వర్యంలో కుప్పగల్ క్రాస్, సిరుగుప్ప క్రాస్, సంతకుడ్లూరు దగ్గర రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశులు, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని, వ్యవసాయ కూలీలకు తక్షణమే ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలని కోరారు. ఈఏడాది తీవ్ర వర్షాభావం పరిస్థితుల వల్ల కరువు ఏర్పడిందని తెలిపారు. కరువు మండలాలుగా ప్రకటించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఆదోనిని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. డిసెంబర్, జనవరిలో వెళ్లాల్సిన వలసలు సెప్టెంబర్ నుంచి ప్రారంభమయ్యాయని, వెంటనే ఉపాధి పనులు 200 రోజులు కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి, వ్యకాస మండల కార్యదర్శి రామాంజనేయులు, రైతు సంఘం మండల అధ్యక్షులు కె.శేఖర్, సిఐటియు మండల అధ్యక్షులు జె.రామాంజనేయులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరందించాలి

- టిడిపి ఇన్‌ఛార్జి తిక్కారెడ్డి



చివరి ఆయకట్టు పొలాలను పరిశీలిస్తున్న తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువ కింద చివరి ఆకట్టుకు సాగునీరందించాలని టిడిపి ఇన్‌ఛార్జి తిక్కారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పొదలకుంట, బంటకుంట ఆయకట్టు పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దిగువ కాలువలో నీరు పుష్కలంగా ఉన్నా ఆయకట్టు పొలాలకు సాగునీరందడం లేదన్నారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. వరి పంటకు ఎకరాకు రూ.50 వేలు, మిరప పంటకు ఎకరాకు రూ.1.50 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలో వస్తే వర్షాలు రావని చెప్పే అధికార పార్టీ నాయకులు, ఇప్పుడు వర్షాలు రాకపోవడానికి కారణం జగన్ అని ఒప్పుకుంటారా అని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాలను కూడా అధికార పార్టీ నాయకులు రాజకీయాలు చేయడం తగదన్నారు. చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరందించ కుంటే రైతుల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. టిడిపి నాయకులు చెన్న బసప్ప, వెంకటపతి రాజు, కొట్రేష్ గౌడ్, రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణకు ఆహ్వానం

ప్రజాశక్తి - మంత్రాలయం



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న నాయకులు

వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణకు స్థానిక వాల్మీకులు ప్రముఖులను ఆహ్వానించారు. బుధవారం స్థానిక శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులును, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని, టిటిడి బోర్డు సభ్యులు సీతారామిరెడ్డిని, వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై.ప్రదీప్ రెడ్డిని కలిసి వాల్మీకి విగ్రహావిష్కరణకు రావాలని ఆహ్వానించారు. పీఠాధిపతులతో పాటు రాంపురం రెడ్డి సోదరులు సానుకూలంగా స్పందించారని వాల్మీకులు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద పాత తహశీల్దార్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ ఈనెల 30న ఉంటుందని వాల్మీకి నాయకులు డిసి.తిమ్మప్ప, మండల ఉపాధ్యక్షులు పులికుక్క, రాఘవేంద్ర, వార్డు సభ్యులు రామాంజనేయులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఆస్పరి

బాధిత కుటుంబాన్ని దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు పరామర్శించారు. ఆస్పరి గ్రామానికి చెందిన మాల హుస్సేని కుమారుడు మాల బాలగణేష్ దేవరగట్టు బన్నీ ఉత్సవాల్లో ప్రమాదవశాతు చెట్టు కొమ్మ విరిగి మృతి చెందారు. విషయం తెలుసుకున్న గుమ్మనూరు శ్రీనివాసులు బుధవారం మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి, తక్షణ సహాయంగా రూ.20 వేలు అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, జడ్‌పిటిసి దొరబాబు, జిల్లా కెడిసిసి డైరెక్టర్ రాఘవేంద్ర, వైసిపి మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య, సొసైటీ సిఇఒ అశోక్, నాయకులు తిమ్మప్ప, ప్రకాష్, కేశవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, విజయ్ కుమార్, మల్లేష్, గఫూర్, శ్రీరాములు, రంగన్న పాల్గొన్నారు.

29న సదస్సును జయప్రదం చేయండి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఈనెల 29న 'రాజ్యాంగం – మనువాదం' అనే అంశంపై ఎమ్మిగనూరులో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు కోరారు. బుధవారం పట్టణంలోని శ్రీనివాస్ భవన్ వద్ద ఉన్న సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో మతోన్మాదాన్ని నెత్తికెత్తుకున్న పాలకుల కారణంగా రాజ్యాంగ హక్కులు అపహాస్యం అవుతున్నాయని తెలిపారు. రాజ్యాంగం స్థానంలో చాతుర్వర్ణ్యాన్ని బలపరిచిన మనువాదాన్ని తిరిగి అమలుపరిచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాజ్యాంగం కారణంగానే సమాజంలో ఉన్న అందరికీ సమాన హక్కులు లభిస్తున్నాయని తెలిపారు. కుల, మత, ప్రాంత, భాష చిచ్చు రాజేస్తూ పాలకులు చేస్తున్న తప్పునకు వ్యవస్థను కారణం చేస్తూ, మనుషుల మధ్య నిప్పు రాజేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ రక్షణ అన్నది



మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరీ బాధ్యత అని తెలిపారు. ఈనెల 29న ఎమ్మిగనూరులోని తేరుబజార్‌లో ఉన్న పద్మశాలి కమ్యూనిటీ హాలులో జిల్లా స్థాయి సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు దళిత్ సోషన్ ముక్తిమంచ్ జాతీయ ఉపాధ్యక్షులు, కెవిపిఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు హాజరవుతున్నారని తెలిపారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప, జిల్లా సహాయ కార్యదర్శి హెచ్.చిన్న మారయ్య, డప్పు కళాకారుల సంఘం మండల అధ్యక్షులు లక్ష్మన్న, కెవిపిఎస్ మండల నాయకులు తాయన్న పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లోని కెవిపిఎస్ కార్యాలయంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకుంటాం

- సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు



ప్రజాశక్తి - కోసిగి

విద్యుత్‌ను పట్టుకొని ఆత్మహత్య చేసుకుంటామని కోసిగి రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం డౌన్ డౌన్' అంటూ విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు. పెండేకల్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని సుమారు 100 మంది రైతులు బుధవారం కోసిగి సబ్ స్టేషన్‌ను ముట్టడించి సబ్ స్టేషన్‌లోకి దూసుకెళ్లారు. విద్యుత్‌ను పట్టుకొని ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, మండల కార్యదర్శి వీరేష్, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతులు కొండగేని వీరారెడ్డి, హనుమంతు, నరసన్న, కోసిగయ్య, అంపయ్య, నాగరాజు, అల్లయ్య, ఈరన్న, రోగన్న, నాగయ్య, అనుమప్ప, మల్లయ్యతో పాటు వంద మంది రైతులు విద్యుత్ కోతలకు నిరసనగా సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. సబ్‌స్టేషన్ ముందు బైఠాయించారు. పగటిపూట 9 గంటలు విద్యుత్ ఇవ్వాలని ధర్నా చేపట్టారు. వ్యవసాయానికి రోజూ 5 గంటలు కూడా విద్యుత్ ఇవ్వకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయని నాయకులు వాపోయారు. ఓవైపు వర్షాల్లేక, మరోవైపు విద్యుత్ కోతలతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని, విద్యుత్ కోతలతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పెద్దకడబూరు : మండలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనకను ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. పెద్దకడబూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా నాయకులు పరమేష్ మాట్లాడారు. వ్యవసాయానికి పగలే 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎఇ గోవిందుకు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వం ఆస్తులకు రక్షణ లేదా..?

- టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో ప్రభుత్వ ఆస్తులకు కూడా రక్షణ లేదని టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, నాయకులు బడిగింజల రంగన్న విమర్శించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసిపి స్థానిక నాయకుడు, ఓ ప్రజాప్రతినిధి గ్రూపునకు చెందిన వారు వినియోగంలో లేని ప్రభుత్వ డిఎన్‌టి హాస్టల్ భవనాన్ని ధ్వంసం చేసి, కిటికీలు, టేకు దూలాలు అమ్ముకునేందుకు కుట్ర పన్నారంటే వైసిపి నాయకులు ఎంతకు దిగజారి పోతున్నారో అర్థమవుతుందని తెలిపారు. ఎవరి సహకారంతో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారో సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వెంటనే ప్రభుత్వ పరంగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మండలంలోని విద్యార్థులకు దేవనకొండలో హాస్టల్ లేదనే విషయం తెలిసిందేనని, విద్యార్థులు లేనందునే హాస్టల్ మూసి వేశామని అధికారులు చెప్పడం సిగ్గు చేటని తెలిపారు. ప్రభుత్వం హాస్టల్‌కు సొంత భవనం కేటాయించి మెరుగైన వసతులు కల్పిస్తే విద్యార్థులు ఎందుకు రారని ప్రశ్నించారు. బయట హాస్టల్ అని బోర్డు పెట్టుకొని స్థానిక వైసిపి నాయకులు ఆ భవనాన్ని కబ్జా చేసి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మండల స్థాయి అధికారులు ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని మండిపడ్డారు. కనీసం ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం ఆస్తులను కాపాడేందుకు ముందుగా ప్రభుత్వ భవనాలను స్వాధీనం చేసుకుని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

బన్నీ ఉత్సవ నిర్వాహకులపై హత్య కేసు నమోదు చేయాలి

- బన్నీ ఉత్సవ మృతులకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా, 5 ఎకరాల పొలం ఇవ్వాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బన్నీ ఉత్సవంలో ముగ్గురు మృతి చెందడం బాధాకరమని, ఉత్సవ నిర్వాహకులపై హత్య కేసు నమోదు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, నాయకులు రామేష్ కోరారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బన్నీ ఉత్సవంలో మృతి చెందిన గణేష్ (17), రామాంజనేయులు (59), ప్రకాష్ (30) కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, 5 ఎకరాల దేవదాయ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సరైన చర్యలు తీసుకోకుండా 100 మందికి గాయాలు, ముగ్గురు మృతి చెందేలా ఉత్సవాన్ని నిర్వహించిన వారిపై మర్డర్ కేసు నమోదు చేయాలని కోరారు. మీడియా వాహనాలను ధ్వంసం చేస్తున్న, ప్రజల ప్రాణాలు పోయేలాగా ప్రేక్షక పాత్ర పోషించిన పోలీసు అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే, ప్రజల్లో మూఢత్వాన్ని పెంచి పోషించే ఉత్సవాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. భారీగా ఆదాయం ఉన్న దేవస్థాన కమిటీ నుంచే మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, 5 ఎకరాల పొలం ఇప్పించాలని డిమాండ్ చేశారు. బన్నీ ఉత్సవంలో మృతి చెందిన ముగ్గురికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వైసిపి బలోపేతానికి కృషి

- కప్పట్రాళ్ల బొజ్జమ్మ



ప్రజాశక్తి- దేవనకొండ

జిల్లాలో వైసిపి బలోపేతానికి, అభివృద్ధికి కృషి చేస్తామని వైసిపి మహిళ విభాగం జిల్లా అధ్యక్షులు కప్పట్రాళ్ల బొజ్జమ్మ తెలిపారు. బుధవారం ఆమె స్వగ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి నుంచి వైసిపిలో చేరిన కొద్దికాలంలోనే తమ సేవలకు గుర్తింపుగా జిల్లా మహిళా విభాగం అధ్యక్ష పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, సహకరించిన ఎంపీ, ఎమ్మెల్యేలకు, వైసిపి పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పదవికి న్యాయం చేస్తూ మరోసారి వచ్చే ఎన్నికల్లో వైసిపి జెండా ఎగరవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా, ఆలూరు నియోజకవర్గంలో పర్యటించి వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఆమె భర్త, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి పరిశీలన

- స్పందన ఫిర్యాదుతో స్పందించిన రోడ్లు, భవనాల శాఖ జెఇ



రోడ్డును పరిశీలిస్తున్న జెఇ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని ప్రధాన రహదారిని రోడ్లు, భవనాల శాఖ జెఇ లక్ష్మీనారాయణ బుధవారం పరిశీలించారు. గోనెగండ్లలోని గంజిహళ్లి రోడ్డు నుంచి ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని గత వారం గోనెగండ్లలో జరిగిన 'జగనన్నకు చెబుదాం'లో కలెక్టర్‌కు గ్రామస్తుడు ఎస్ఎన్.మహబూబ్ వలీ ఫిర్యాదు చేశారు. స్పందించిన రోడ్లు, భవనాల శాఖ అధికారులు ప్రధాన రహదారి పరిస్థితిని పరిశీలించేందుకు కోడుమూరు రోడ్లు, భవనాల శాఖ జెఇ లక్ష్మీనారాయణను పంపారు. గోనెగండ్లలో ఆయన ప్రధాన రహదారి వెంట డ్రెయినేజీ సమస్య, వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. సమస్యకు సంబంధించి పరిశీలించిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య...

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని ముసానహళ్లి గ్రామంలో ఉరేసుకొని బసప్ప (33) ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లి రెండేళ్లుగా తిరిగి కాపురానికి రాలేదు. జీవితం మీద విరక్తి చెంది ఉదయం ఇంటి పక్కన ఉన్న గుడిసెలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతునికి భార్య లక్ష్మీ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

30న 'ప్రజా రక్షణ భేరి'

- సిపిఎం జిల్లా నాయకులు గోవిందు

- గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 30న చేపట్టే సిపిఎం 'ప్రజారక్షణ భేరి' బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు గోవిందు, హనుమంతు, డివిజన్ నాయకులు రాముడు కోరారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ తెస్తామని చెప్పిన పాలక పార్టీలు ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. జిల్లా నుంచి రాజకీయంగా అత్యున్నత పదవులు పొంది అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. జిల్లాలో ఒక్క భారీ పరిశ్రమ కూడా లేదని, సాగునీరు, పారిశ్రామిక రంగం, విద్యాభివృద్ధిలో వెనుకబడి ఉందని తెలిపారు. జిల్లాలో సహజ వనరులకు కొదవలేదని, పాలకుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధిలో అట్టడుగున ఉందని అన్నారు. ఎవరో వచ్చి ఉద్ధరిస్తారని ఎదురుచూసే లోపు ప్రజల జీవితాలు బుగ్గిపాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేవాలని, జిల్లా అభివృద్ధి కోసం రూ.10 వేల



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగం అభివృద్ధి జరగాలంటే నిధులు కేటాయించాలని కోరారు. సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి 'ప్రజా రక్షణ భేరి' పేరుతో ఈనెల 30 నుంచి బస్సు యాత్రలు చేపట్టనున్నట్లు తెలిపారు. 30న ఆదోనిలో ప్రారంభమవుతున్న ఈ బస్సు యాత్రకు ముఖ్య అతిథిగా సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ దావలే, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, రమాదేవి హాజరవుతారని చెప్పారు. 30న ఉదయం 10 గంటలకు ఆదోనిలో పాత బస్టాండ్ నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. సురేష్, అబ్దుల్లా, కృష్ణ, రాజు, రాముడు, రమేష్ పాల్గొన్నారు.

దేవరగట్టులో కర్ణాటక మద్యం, నాటుసారా

ప్రజాశక్తి - హోళగుంద

దేవరగట్టులో మంగళవారం జరిగిన కర్రెల సమరంలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు, నాటుసారా దర్శనమిచ్చాయి. ఇంత మంది పోలీసులు ఉన్నా కర్ణాటక మద్యం దేవరగట్టులో ప్రత్యక్షం కావడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని పలువురు వాపోయారు. రెండు నెలలుగా ఎక్సైజ్ పోలీసులు దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా కాస్తున్న నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి వందల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. దేవరగట్టులో ఏ దారిలో చూసినా నాటుసారా కనబడడం వెనుక పోలీసుల పాత్ర ఉండే ఉంటుందని చర్చించుకుంటున్నారు. శ్రీమాల మల్లేశ్వర జైత్రయాత్రలో భక్తులు మద్యం సేవించి పాల్గొనడం, ఇష్టానుసారంగా ఒకరినొకరు కొట్టుకోవడం వల్ల అధిక సంఖ్యలో గాయాలవుతున్నాయని అభిప్రాయ పడుతున్నారు. మద్యం సేవించి ఉత్సవంలో పాల్గొన్న భక్తుల కుటుంబాలు మాత్రం రోడ్డున పడుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో మద్యం అమ్మకాలు జరగకుండా పోలీసులు ప్రణాళికలతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దర్గా నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నందవరం

గ్రామంలో వెలసిన శ్రీదస్తగిరయ్య దర్గా నిర్మాణానికి బుధవారం పూలచింత శ్రీవరబండే గురు మఠం పీఠాధిపతి బండే గురుస్వామి, సర్పంచి అక్కమాదేవి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. గ్రామంలో ఆలయాలు, దర్గా నిర్మాణానికి తమ వంతు సహాయం చేయడానికి ముందుంటామని తెలిపారు. గ్రామంలో బండే గురుస్వామి జాతరను కులమతాలకతీతంగా జరుపుకుంటారన్నారు.

రాంజల చెరువు కట్ట పటిష్టతకు చర్యలు : కమిషనర్

ఆదోని : రాంజల చెరువు పటిష్టతకు చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ నాగభూషణం రెడ్డి తెలిపారు. బుధవారం కట్ట మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాంజల చెరువు ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ.2.04 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. చెరువు కట్టపై సిమెంట్ రోడ్లు, సైడ్ వాల్ పటిష్టతకు చేస్తున్న పనులను చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

కరువు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని టిడిపి నాయకులు మండిపడ్డారు. బుధవారం మండలంలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గతవారం ఎమ్మిగనూరులో పర్యటించినా, గతనెలలో డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో పర్యటించినా రైతుల గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. పంటలు ఎండిపోతున్న పట్టించుకోలేదన్నారు. గతేడాది రైతులు పూర్తిగా నష్టపోయినా మండలంలో పంట నష్టపరిహారం ఇవ్వలేదని తెలిపారు. పెద్దహరివాణం గ్రామంలో ఉల్లి సాగు చేయకపోయినా 50 మంది రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చిందని చెప్పారు. ఈ ఏడాది అయినా పంట పొలాలను పరిశీలించి నివేదికలు తయారు చేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ఆదోని డివిజన్‌లో తీవ్ర కరువు ఏర్పడినా, రైతులు వలస బాట పడుతున్నా మంత్రులు బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరామ్ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మంత్రి గుమ్మనూరు నియోజవర్గంలో రైతులు పూర్తిగా నష్టపోయారని, మంత్రి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈఏడాది ఆగస్టు 10న రాష్ట్ర మంత్రులు గుమ్మనూరు జయరామ్, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిలు తుంగభద్ర డ్యామ్‌లో బస చేసినా ఆంధ్రాకు జరుగుతున్న అన్యాయంపై బోర్డు అధికారులతో చర్చించలేదని తెలిపారు. కేవలం బోర్డు పరిధిలో జరుగుతున్న పనుల పర్సెంటేజీలకే మంత్రులు, ఎమ్మెల్యేలు అక్కడికి వెళ్లారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఆంధ్రాకు రావాల్సిన 650 క్యూసెక్కుల నీటి వాటాను సాధించాలని డిమాండ్ చేశారు. నవంబర్ 30కి తుంగభద్ర దిగువ కాలువకు నీటి సరఫరా నిలిపివేస్తామని బోర్డు అధికారులు ప్రకటిస్తే, దానిపై నోరు మెదపని పాలకులు అవసరమా అని ప్రశ్నించారు. జనవరి వరకు ఎల్‌ఎల్‌సికి సాగునీరు సాధించాలని, ఎండిపోతున్న మిరప, వరి, పత్తి పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. మాజీ కౌన్సిలర్ రామచంద్ర, సోమశేఖర్ రెడ్డి, మల్లికార్జున, మద్దికెర రామకృష్ణ, కనే జగదీష్, నానాపురం షాషావలీ, జి.ఇస్మాయిల్ పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

రైతులను ఆదుకోవాలి

- రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్

ప్రజాశక్తి - కోసిగి

వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన ప్రతి ఎకరాకూ నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం మండల కార్యదర్శి వీరేష్ కోరారు. బుధవారం ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో రైతులు వేరుశనగ, పత్తి, మిరప, ఉల్లి, ఆముదం తదితర పంటలు సాగు చేశారని తెలిపారు. ఆగస్టులో వర్షాలు కురవకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయాయని, పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. మండలంలో వ్యవసాయ కూలీలు దూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి, పంట నష్టపోయిన ప్రతి ఎకరాకూ నష్టపరిహారం అందించాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, కెవిపిఎస్ మండల కార్యదర్శి హనుమంతు, వ్యకాస మండల కార్యదర్శి నాగేంద్ర, ముక్కరన్న, కాళింగ, ఈరన్న, దొడ్డి హనుమంతు, తాయప్ప, మహానంది, హనుమంతు, కోసిగయ్య, రైతులు పాల్గొన్నారు.

అసమానతల్లేని అభివృద్ధి కోసం 'ప్రజా రక్షణ భేరి' : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

అసమానతలు లేని అభివృద్ధి కోసం చేపట్టే 'ప్రజా రక్షణ భేరి' బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు కోరారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 30న బస్సు యాత్ర ఆలూరుకు చేరుకుంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని, ప్రజలపై అనేక రకాల భారాలు వేశారని విమర్శించారు. ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ఆస్పరి మండలంలో ఈనెల 26, 27న ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ బస్సు యాత్రలో ప్రజలు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణ పాల్గొంటారని తెలిపారు. సిపిఎం నాయకులు రంగస్వామి, మధు రెడ్డి, రవి, మురళీ, సుధాకర్, లవయ్య పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ధ్యేయం

- వైసిపి మండలాధ్యక్షులు శివారెడ్డి గౌడ్

ప్రజాశక్తి - నందవరం

పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి మండల అధ్యక్షులు శివారెడ్డి గౌడ్, ఎంపిడిఒ దశరథ రామయ్య తెలిపారు. బుధవారం నందవరం సచివాలయం–2లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. 650 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 77 మందికి కంటి పరీక్షలు, 12 మందికి కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని తెలిపారు. డాక్టర్ పరిమళ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ శ్రీచరణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో సాగునీరు

- సర్పంచి గోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి సహకారంతో ఆయకట్టు పొలాలకు సాగునీరందుతోందని బంటకుంట సర్పంచి గోపాల్ రెడ్డి, మల్లయ్య తెలిపారు. బుధవారం బంటకుంట గ్రామ సమీపంలోని కాలువపై రైతుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాధవరం మేజర్ కాలువ కింద చింతపల్లి, చూడి, ఉరుకుంద, మధిరే, పొదలకుంట, సులేకేరి, బంటకుంట, అగసలదిన్నె గ్రామాల రైతుల ఆయకట్టు పొలాలకు సాగునీరు అందుతున్నాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల వల్ల సాగునీరు సరిపోవడం లేదని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. 20 క్యూసెక్కుల ఉన్న నీటిని, అధికారులతో చర్చించి 40 క్యూసెక్కులు సరఫరా అయ్యేలా కృషి చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామ రైతులు సమావేశమై వంతుల వారీగా నీటిని పొలాలకు కట్టుకుంటున్నట్లు చెప్పారు. టిడిపి నాయకులు తిక్కారెడ్డి కాలువపై పర్యటించి సాగునీరందడం లేదని చెప్పడంలో వాస్తవం లేదన్నారు. వరి, మిరప పంటలకు ప్రాధాన్యత ఇచ్చి వినియోగించుకుంటున్నామని పేర్కొన్నారు. రైతులు బసప్ప, నాగేష్, హనుమంతు రెడ్డి, చూడి నరసప్ప, వెంకటేష్, దొడ్డ బసప్ప, రామన్న గౌడ్, రాజేంద్ర, నాయకులు వడ్డే రాముడు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ గోడపత్రిక విడుదల

ప్రజాశక్తి - కోసిగి

చెకుముకి టాలెంట్ టెస్ట్ గోడపత్రికలను జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ చేతుల మీదుగా బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెకుముకి టాలెంట్ టెస్ట్ విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందిస్తోందని తెలిపారు. అనంతరం జెవివి జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య మాట్లాడారు. ప్రతేడాది సైన్స్ సంబరాల్లో భాగంగా విద్యార్థి లోకానికి సైన్స్‌ను చేరువ చేసేందుకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పతకం సాధించిన విద్యార్థి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పతకం సాధించినట్లు ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు శంకరప్ప తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఈనెల 19 నుంచి 21 వరకు చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో 9వ తరగతి విద్యార్థి హెచ్.జగదీష్ రజత పతకం సాధించారని తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థి బి.అనిమేష్, యు.నవీన్, బికె.సుమలతను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ యు.బాలప్ప, ఉపాధ్యాయులు నాగేంద్రుడు, వ్యాయామ ఉపాధ్యాయులు రామన్న, జూనియర్ అసిస్టెంట్ శివరాజ్ కుమార్, వెంకట్, మల్లప్ప పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గురువారం 26 అక్టోబర్ 2023
5



కష్టాల బోధన

- ఉపాధ్యాయులపై తీవ్ర పనిభారం - అందాల్సినవీ సక్రమంగా అందని వైనం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నంద్యాల జిల్లాలో దాదాపు 6వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు. బోధన కంటే ఇతర పనుల భారం వీరిపై అధికం కావడంతో గత రెండు, మూడేళ్లుగా చాలామంది ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడితో బాధపడుతున్నారు. సమయానికి కనీసం జీతాలు కూడా సర్కారు ఇవ్వకపోవడంతో ఆర్థికంగానూ అవస్థలు పడాల్సి వస్తోంది. విద్యార్థులకు బోధన విషయంలో ఎంత ఒత్తిడినైనా ఆనందంగా స్వీకరించే గురువులపై యాప్‌లు, జిఇఆర్‌లు, ముఖ గుర్తింపుతో అదనపు భారం పెంచేయడంతో కుంగిపోతున్నారు. ఉపాధ్యాయులకు అందించే జీతాల నుంచి అన్ని సౌకర్యాల్లోనూ ప్రభుత్వం విపరీతంగా కోతలు విధిస్తోంది. ఇంటి అద్దెలోనూ కోత వేశారు. ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఎ) కూడా 20 శాతం ఉంటే 16 శాతానికి, 15 శాతం ఉన్న వాళ్లకు 12 శాతానికి, 12 ఉన్న వాళ్లకు 10 శాతానికి తగ్గించారు. నగరాలు, మున్సిపాల్టీలు, గ్రామాల్లో పని చేసే వారందరికీ గతంలో ఉన్న హెచ్‌ఎస్‌ఎలో కోత వేశారు. ఉదాహరణకు రూ.15 వేల హెర్‌ఆర్‌ఎ ఉంటే అది రూ.12,500కు తగ్గిపోయింది. ఉపాధ్యాయులు ఇఎల్‌ను సరెండర్ లీవుగా చేసుకుని డబ్బుగా మార్చుకుంటారు. అయితే ఉపాధ్యాయులకు గత ఏడాదిన్నర నుంచి సరెండర్ లీవు క్యాష్ మంజూరైనా బ్యాంకు ఖాతాల్లో మాత్రం డబ్బులు పడలేదు. (రూ.50 వేల జీతం ఉన్న ఉపాధ్యాయులు 15 రోజులు సరెండర్ లీవులు పెడితే రూ.25 వేల వరకూ డబ్బులొస్తాయి.) ఒక ఉపాధ్యాయుడికి జీతాన్ని బట్టి ఎన్ని రోజులు సెలవులు సరెండర్ చేస్తే అంత జీతం అదనంగా ఇస్తారు. ఇవేమీ పూర్తిస్థాయిలో వస్తున్న పరిస్థితి లేదు.

> ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తీవ్ర పని ఒత్తిడితో ఆందోళనకు గురవుతున్నారు. బోధన కంటే ఇతర పనుల భారం ఎక్కువ కావడంతో మానసికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన జీతాల నుంచి మిగిలిన అన్ని సౌకర్యాల్లోనూ కోతలు విధిస్తు న్నారు. చివరకు ప్రతి నెలా జీతాలకు సైతం రోజులు తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరు పట్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు...

హాజరుకు అష్టకష్టాలు

ప్రస్తుతం ఉపాధ్యాయులకు వారి మొబైల్ ఫోన్లలోనే ముఖగుర్తింపు యాప్‌ను అప్‌లోడ్ చేశారు. అయితే ఉదయం, సాయంత్రం దీనిలో హాజరు వేసుకోవడం తలకు మించిన భారంగా మారుతోంది. ఒకేసారి ఉపాధ్యాయులంతా హాజరు వేసుకునేందుకు ప్రయత్నిస్తుండడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. కనీసం 20 నిమిషాలు ప్రయత్నిస్తేనే హాజరు పడుతోంది. ఏమాత్రం పడకపోయినా షోకాజ్ నోటీసులు వస్తున్నాయని గురువులు వాపోతున్నారు. పాఠశాల వదిలేసిన తర్వాత కూడా అక్కడే ఉండి హాజరు వేసుకుని వెళ్లేందుకు సెల్‌ఫోన్లతో కుస్తీలు పడుతున్నారు.

యాప్‌లతో మరింత పని ఒత్తిడి

మధ్యాహ్న భోజనం యాప్‌లో ప్రతిరోజూ వండిన ఆహార పదార్థాలను ఉపాధ్యాయుని ఫొటోతో సహ అప్‌లోడ్ చేయాలి. గురువులకు ఇప్పుడు ఇదొక భారం. ఆహారం సరిగా లేకపోతే అప్‌లోడ్ చేసిన వాళ్లే బాధ్యులు. మరుగుదొడ్ల నిర్వహణ ఫండ్ (టిఎంఎస్) యాప్‌లో ప్రతిరోజూ పాఠశాలలోని మరుగుదొడ్లు, మూత్రశాలల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పని చేసే ఈ యాప్‌లో ఒక్కోసారి అంతా బాగున్నా బాగోలేదంటూ చూపిస్తోందని, షోకాజ్ నోటీసులు వస్తున్నాయని గురువులు వాపోతున్నారు. వివిధ రకాల పనులతో సతమతమవుతూ పని భారంతో నెలంతా పని చేస్తున్నా ప్రతినెలా ఇచ్చే జీతాల కోసం ఉపాధ్యాయులు రోజులు తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ప్రతి నెలా ఉత్పన్నమవుతోంది. ఆగస్టుకు సంబంధించిన జీతాలు సెప్టెంబరు 12వ తేదీ దాటినా పూర్తిస్థాయిలో పడలేదు. జూన్ 10వ తేదీతో ఉపాధ్యాయుల బదిలీలు ముగిశాయి. ఉమ్మడి జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు గత మూడు, నాలుగు నెలలుగా జీతాలందలేదు.

బోధనకే పరిమితం చేయాలి



ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరిగింది. పాఠశాలకు వెళ్లినప్పటి నుండి మధ్యాహ్న భోజన విషయాలు, టాయిలెట్ మెయింటెనెన్సు, విద్యాకానుక డిస్ట్రిబ్యూషన్, వాటిని ఆన్లైన్‌లో థంబ్ వేయించడం, ప్రతి రోజు ఏదో ఒక గూగుల్ షీట్ ఫిలప్ చేయడం, ఎన్నో అన్ లైన్ ట్రైనింగ్‌లతో ఎన్నో యాప్‌లతో ఉపాధ్యాయులకు చదువు చెప్పే సమయం తగ్గి పోయి ఇతర పనులు ఎక్కువయ్యాయి. ఉపాధ్యాయు లను బోధనకే పరిమితం చేయాలి. బోధనేతర పనులు తగ్గించాలి.

- పి.వి.ప్రసాద్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు.

ఇవిఎంలను పరిశీలించిన కలెక్టర్




మూమెంట్ రిజిస్టర్ లో సంతకం చేస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలనను జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్ పరిశీలించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో ఈవీఎంల భద్రత గోడౌన్లో జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలనను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్లకు సంబంధించి ఎఫ్ఎల్‌సి కార్యక్రమం బెల్ ఇంజనీర్లు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సహకారంతో లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. జిల్లాకు వచ్చి ప్రస్తుతం గోడౌన్‌లో నిల్వ ఉన్న 3003 కంట్రోల్ యూనిట్లు, 5129 బ్యాలెట్ యూనిట్లు, 4922 వివి ప్యాట్ల ప్రథమ స్థాయి పరిశీలన ఇప్పటివరకు పూర్తయిందని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఇంకా 1355 కంట్రోల్ యూనిట్లు, 1960 బ్యాలెట్ యూనిట్లు,1960 వివిపిఎటిల ప్రథమ స్థాయి పరిశీలన ప్రక్రి యను వచ్చేనెల 10లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జగనన్నా జర చూడన్నా..

- సమస్యల వలయంలో జగనన్నా కాలనీలు -కరెంటు, నీరు లాంటి కనీస సౌకర్యాలు కరువు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



కూలూరు వస్తాలోని జగనన్న కాలనీ

ప్రజాశక్తి - చాగలమర్రి

మండల కేంద్ర మైన చాగలమర్రిలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన జగనన్నా కాలనీలలో కనీస సౌకర్యాలు లేక లబ్దిదారులు నానా తంటాలు పడుతున్నారు. గ్రామంలోని కూలూరు రస్తాలో 390 మందికి, మల్లెవేముల రస్తాలోని కస్తూరిబా వసతి గృహం పక్కన 395 మందికి, గుంతపాలెం వీధిలో 194 మందికి, నారాయణ పల్లె రస్తాలో 254 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఆయా కాలనీలలో లబ్దిదారులు అతి కష్టం మీద ఇంటి నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. ఇందులో కొన్ని పూర్తి కాగా మరికొన్ని బేస్మేట్‌లకే పరిమిత మయ్యాయి. మొదట జగనన్నా కాలనీల్లో విద్యుత్, ఇంటింటికి కోళాయి అని ఊదర గొట్టిన ఇంత వరకు అవి అములుకు నోచుకోలేదు. ముఖ్యమంగా నీరు, విద్యుత్ సౌకర్యం లేక లబ్ది దారులు నానా అవస్థలు పడుతున్నారు. కాలనీల్లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, కరెంటు పోల్స్ ఏర్పాటు చేసినా అవి అలంకరణ ప్రాయంగా మారాయి. కాలనీల చివరన ఒక మినీ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి వదిలేశారు. దీంతో చివర ఉన్న లబ్దిదారులు నిర్మాణం కోసం నీరు అందక పైపులు చిన్న పాటి మోటర్లు, మరికొందరు నీటి ట్యాంక్‌ల ద్వారా నీటిని తెచ్చుకొని తమ గృహ నిర్మాణాలు చేసుకొంటున్నారు. ట్రాన్స్ఫార్మర్లు బిగించి ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం కల్పించ లేదు. దీంతో ఆయా కాలనీలలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ కంప చెట్లు మొలుస్తూ అలంకార ప్రయంగా మారాయి. ఇంటి నిర్మాణానికి బెడ్డు వేయ్యాలన్నా, స్లాబ్ వేయ్యాలన్నా నీటి కోసం లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చే డబ్బు ఏ మూలకు సరిపోవడం లేదని అయినా అప్పో సోప్పో చేసుకొని నిర్మాణాలు చేస్తున్నామని లబ్దిదారులు వాపోతున్నారు. దీనికి తోడు కనీస సౌకర్యాలు నీరు, విద్యుత్ లేక మా బాధలు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కప్పించాలని లబ్దిదారులు కోరుతున్నారు. ఈ విషయంపై హౌసింగ్ అధికారి షఫి ఉల్లా మాట్లాడుతూ కాలనీలలో నెలకొన్న విద్యుత్, నీటి సౌకర్యాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సి ఉందని వివరించారు.



ట్యాంకుల ద్వారా నీటిని పట్టుకుంటున్న



అలంకారప్రాయంగా ఉన్న కరెంటు ట్రాన్స్ఫార్మర్

ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఈనెల 31న ఆత్మకూరులో జరిగే ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వి. ఏసురత్నం, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్‌లు పేర్కొన్నారు. బుధవారం ప్రజారక్షణభేరి బస్సు యాత్ర పోస్టర్స్‌ను పట్టణంలోని సుదర్శన వర్మ భవన్ నందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టులు నిర్మించాలని, కరువుతో అల్లాడిపోతున్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. విద్యుత్ యూనిట్ రూపాయికే ఇవ్వాలని, పేదలకు 300 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని కోరారు. స్మార్ట్ మీటర్ల బిగింపు, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రూ.400కే గ్యాస్, రూ.60కే లీటర్ పెట్రోలు, డీజిల్ ఇవ్వాలని కోరారు. ఇసుక ఉచితంగా, తలకు పది కిలోల ఉచిత బియ్యం, పప్పు నూనెల సరఫరా, నిత్యావసర ధరల తగ్గించాలని డిమాండ్ చేశారు. పేదలకు రెండు సెంట్ల ఇల్లు, రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. నివాసిత ప్రాంతాల్లోనే ఇళ్లకు పట్టాలు, కొత్తకాలనీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో 'ప్రజా రక్షణ భేరి'లో భాగంగా ఈనెల 31న రాష్ట్రస్థాయి బస్సు జాత ఆత్మకూరు పట్టణానికి విచ్చేస్తుందని, పట్టణ ప్రజలు, మేధావులు, కార్మికులు, కర్షకులు నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎం. రజాక్,శంకర్ రెడ్డి,నాయకులు డి రామ్ నాయక్, ఏ సురేంద్ర, మా బాష,జి. నాగేశ్వరావు,పి సుధాకర్,వీరన్న, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం ప్రజా ప్రణాళిక అమలుకై పోరాడుదాం

నందికొట్కూరు టౌన్ : సిపిఎం ప్రజా ప్రణాళిక అమలుకై ఐక్యంగా పోరాదమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక భరత్ కాంప్లెక్స్‌లో సిపిఎం ప్రజా ప్రణాళికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ కరెంటు యూనిట్ రూపాయికే ఇవ్వాలని, పేదలకు 300 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని, స్మార్ట్ మీటర్లు వద్దు, ట్రూ అప్ చార్జీలు రద్దు, తదితర ప్రజా ప్రణాళిక అమలుకై ఈనెల 28, 29 తేదీలలో జీపు జాతాను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే భాస్కర్, పి పకీర్ సాహెబ్, బెస్తరాజు టి ఓబులేష్,, సిఐటియు నాయకులు టి గోపాలకృష్ణ, ఆంజనే యులు, నాగన్న, వ్యాకాస జిల్లా నాయకులు ఎం కర్ణ, ఈశ్వరమ్మ, మద్దమ్మ, కెవిపిఎస్ జిల్లా నాయకులు రంగమ్మ, ఉషనమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్ విడుదల

నంద్యాల: కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నవంబర్ 15న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు సిపిఎం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నాడు నంద్యాలలో సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహ సీనియర్ నాయకులు తోట. మద్దులు, కార్యదర్శి వర్గ సభ్యు లు కే మహమ్మద్ గౌస్, లక్ష్మణ్, వెంకట లింగం,పట్టణ నాయకులు మాదాల శ్రీనివాసులు వీరసేన చలో విజయవాడ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. మిగతా 6వ పేజీలో...



నందికొట్కూరు టౌన్ : పోస్టర్లను విడుదల చేస్తున్న ఎం నాగేశ్వర రావు, సిపిఎం నాయకులు

కెసి ఆయకట్టులో రబీ సాగు చేయెుద్దు : ఎఇ

ప్రజాశక్తి - పాములపాడు

కెసి కెనాల్ ఆయకట్టు రైతాంగం రబీ సాగు చేయవద్దని కెసి కెనాల్ ఎఇ శ్రీనివాసులు నాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కెసి కెనాల్ కింద నవంబర్ చివరినాటి వరకే సాగునీరు అందుతుందని రైతాంగం రబీ సాగు చేసినట్లయితే పంటలకు సరిపడా నీరు అందదని పేర్కొన్నారు. పెట్టుబడి పెట్టి రైతాంగం నష్టపోయే అవకాశం ఉందని రబీ సాగు చేయవద్దని రైతులకు వారు సూచించారు.



మాట్లాడుచున్న సిపిఎం నాయకులు

రైతులకు 9 గంటల విద్యుత్ ఇవ్వాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - ప్యాపిలి

రైతులకు 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని సిపిఎం జిల్లా నాయకులు కోయలకొండ నాగరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి చిన్న రహిమాన్ పేర్కొన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో మాట్లాడుతూ మండలంలో వర్షాలు లేక పంటలు ఎండిపోయి, పెట్టిన పెట్టుబడి రాక రైతులు అల్లాడుతూవుంటే, కనీసం బావి, బోర్లు ఉన్నా చోటనైనా ఎంతోకొంత పంటలు వేసి పండించుకుందామని రైతులు మోటార్ల ద్వారా నీటిని నింపుకొని పంటలను పండించుకుందామని ఆరాటపడుతుంటే, విద్యుత్ అధికారులు విద్యుత్ ను 7గంటలు మాత్రమే విద్యుత్ వదలడం బాధాకరమైన విషయం అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో లేదని అన్నారు. కార్యక్రమంలో రంగస్వామి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

28న శ్రీశైల ఆలయ ద్వారాలు మూసివేత

ప్రజాశక్తి - శ్రీశైలం

ఈనెల 28వ తేదీన పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడుతున్న సందర్భంగా 28వ తేదీ సాయంత్రం నుండి 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆలయ ద్వారాలు మూసివేస్తున్నట్లుగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 28న మధ్యాహ్నం 12:30 గంటల వరకు మాత్రమే గర్భాల అభిషేకాలు నిర్వహించబడతాయని, మధ్యాహ్నం 3:30 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామివారి సర్వ దర్శనం అవకాశం కల్పించబడుతుందన్నారు. స్వామివారి స్పర్శ దర్శనం (500 రూపాయలు టికెట్) ఉదయం మాత్రమే దర్శనం కల్పించబడుతుందని, మధ్యాహ్నం మూడున్నర గంటలకు మంగళ వాయిద్యాలు సుసాంధ్యం సాయంకాలం పూజలు మహా మంగళ హారతులు నిర్వహించబడతాయన్నారు. భక్తులకు అందించే నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం వరకు మాత్రమే నిర్వహించబడుతుందని, సాయంకాలం భక్తులకు అందించే అల్పాహార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మరుసటి రోజు 29వ తేదీ ఉదయం తెల్లవారుజామున ఆలయ ద్వారాలు తెరిచి ఆలయ శుద్ధి సంప్రోక్షణ ప్రాతఃకాల పూజలు నిర్వహించిన తర్వాత ఉదయం 7 గంటల నుండి దర్శనాలు అభిషేకాలు ఆర్జిత అభిషేకాలు యధావిధిగా కొనసాగుతాయని ఇఒ తెలిపారు.

కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు 8న విద్యా సంస్థల బంద్

వామపక్ష విద్యార్థి యువజన సంఘాల నేతలు

ప్రజాశక్తి - నంద్యాల

నవంబర్ 8న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. బుధవారం నంద్యాల సిపిఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం.డి.రఫీ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు, డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నిరంజన్, పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి రాంబాబు మాట్లాడారు. అనేక పోరాటాలలో 32 మంది విద్యార్థి యువజనల ప్రాణ త్యాగాలతో ఏర్పాటు చేసుకున్నటువంటి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణమని అన్నారు. దీనికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు కార్మికులు అనేక ఉద్యమాలు చేస్తున్న పట్టించుకోవడంలేదని అన్నారు. వచ్చే నవంబర్ 8 నాటికి కార్మికులు చేస్తున్న నిరాహార దీక్షలు 1000 రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాలు ప్రత్యక్షంగా ఆందోళనలో పాల్గొనడంతో పాటు ఆరోజు విద్యాసంస్థల బంద్ నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, పార్లమెంట్ నిర్మాణానికి కూడా ఉక్కునందించినటువంటి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఎలా ప్రైవేటీకరణ చేస్తారని ప్రశ్నించారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

29న నంద్యాలలో రౌండ్ టేబుల్ సమావేశం

కడపలో ఫ్యాక్టరీ సాధన మరియు విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి ,యువజన, మహిళా, కార్మిక, మేధావు లతో నంద్యాల పట్టణంలో ఈనెల 29న రౌండ్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి సురేష్, పిడిఎ స్‌యు జిల్లా నాయకులు బాలాజీ, నంద్యాల పట్టణ అధ్యక్షులు షాహిద్,రవి తేజ,ఆనంద్,ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

కొడుకును కడతేర్చిన తండ్రి

ప్రజాశక్తి - వెలుగోడు



మృతి చెందిన శీను

కన్నకొడుకునే కడతేర్చిన ఘటన బుధవారం వెలుగోడు పట్టణంలో చోటు చేసుకంది. వెలుగోడు ఎస్ఐ వెంకట ప్రసాద్, ఆత్మకూరు డిఎస్పీ శ్రీనివాసరావు, సిఐ నాగభూషణం తెలిపిన వివరాల మేరకు.. సిపి నగర్‌లో నివాసి రామకృష్ణ కుట్టు మిషన్ మీద పట్టాలు కుట్టుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. రామకృష్ణకి శ్రీనివాసులు అనే కుమారుడు ఉన్నాడు. మద్యానికి బానిసైనా రోజు ఇంటికి వచ్చి గొడవ పడేవాడు. రోజుమాదిరిగానే శ్రీనివాసులు (36) మద్యంతాగి వచ్చిన తండ్రి రామకృష్ణతో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో గోడవ పడ్డాడు. సహనం కోల్పోయిన తండ్రి రామకృష్ణ కొడుకు శ్రీనివాసులు మెడకు కండువా బిగించి హత మార్చినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మంగళ వాయిద్య కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మంగళ వాయిద్య కళాకారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఆ సంఘం జిల్లా కన్వీనర్ రాధాకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలో నియోజకవర్గం స్థాయి కమిటీ సమావేశము బాల నరసిం హుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావే శమునకు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వాయిద్య కళాకారులు ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారని, వాళ్లను గుర్తించి కళాకారులుగా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి విద్య, వైద్యం ఉపాధి అందించాలని, కళాకారులకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా మండలాల వారీగా సంఘాలు ఏర్పాటు చేసుకొని జాతి కోసం, సమాజం కోసం పాటు పడాలని తెలిపారు.

మండలాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక


నియోజవర్గంలోని ఆళ్లగడ్డ మండలం అధ్యక్షునిగా బాల నరసిం హుడు, కార్యదర్శిగా చింతకుంట శ్రీకాంత్‌ను ఎన్ను కున్నారు. అలాగే చాగలమర్రి మండలం అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, సుబ్బారావు, రుద్రవరం మండలం అధ్యక్ష, కార్యదర్శులుగా మంగలి వెంకటేశ్వర్లు, ఎల్లావత్తుల రవిలని ఎన్నుకున్నారు. దొర్నిపాడు మండలం అధ్యక్ష, కార్యదర్శులు గా రామచంద్రుడు, దస్తగిరి, సిరివెళ్ల మండలం అధ్యక్ష, కార్యదర్శులుగా తిమ్మ రాజు, రమణ, ఉయ్యాలవాడ మండలం అధ్యక్ష కార్యదర్శులుగా రామ మోహన్, రవి ఎన్నికయ్యారు.



నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

జాతీయ గ్రేట్ ఆర్టిస్ట్ అవార్డుకు దేశెట్టి శ్రీనివాసులు చిత్రం ఎంపిక

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్





విశాఖపట్నం చోడవరం చిత్రకళ నిలయం 6వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో నందికొట్కూరు పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు దేశెట్టి శ్రీనివాసులు వేసిన పంపిన 'చెట్లను నరకవద్దు - మానవాళికి ముప్పు తేవద్దు' అనే సందేశాత్మక చిత్రం జాతీయ గ్రేట్ ఆర్టిస్ట్ అవార్డుకు ఎంపికైంది. వాట్సప్ ద్వారా సందేశం వచ్చిన్నట్లు బొడ్డేటి సూర్యనారాయణ శ్రీనివాసులుకు తెలిపారు. బహుమతి ప్రధానం నవంబర్ 4వ తేదీన ఉంటుందని వారు తెలిపారు. దేశెట్టి శ్రీనివాసులకు గతంలో 40 దాకా జాతీయ, రాష్ట్రీయ అవార్డులు అందుకున్నారు.

సాగునీరు విడుదల

ప్రజాశక్తి - రుద్రవరం

తెలుగు గంగ ప్రధాన కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేసినట్లు తెలుగు గంగ ఈఈ శంకర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వారబంది పద్ధతిలో తెలుగంగ కాలువకు నీటిని విడుదల చేస్తున్న సంగతి విధితమే అన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం వెలుగోడు బ్యాలెన్స్ రిజర్వాయర్ నుంచి 2000 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ నీరు రుద్రవరం మండలానికి గురువారం ఉదయం సమయానికి చేరుకుంటుం దన్నారు. రైతులు ఈ నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రస్తుతం రైతులు రబీ సీజన్లో సాగుచేసిన పంటలకు మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. వరి పంటను రైతులు సాగు చేసుకోవద్దన్నారు. ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని ఆయన కోరారు.

29న ఎపిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - బనగానపల్లె

ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఉద్యోగులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.మాధవ స్వామి తెలిపారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో ధర్నా పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాధవ స్వామి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఓపీఎస్ అమలు చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక సిఎం జగన్ మాట తప్పారని అన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను ఓపీఎస్‌కి తీసుకురావాలని కేంద్రం మెమో ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, కారుణ్య నియామకాలు పూర్తి చేయడం లేదని విమర్శించారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమ ంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రామకృష్ణ, ఏపీటీఎఫ్ మండలాధ్యక్షులు జే.వెంకట కృష్ణుడు, అనిల్ కుమార్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్

వైసిపి ప్రభుత్వంలోనే ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

వైసిపి ప్రభుత్వంలోనే బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ పథకాలు సాధ్యం అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు అన్నారు. బుధవారం మండలంలోని గొర్విమానుపల్లె గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి వైఎస్‌ఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ పార్టీ కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, బనగానపల్లె నియోజకవర్గం వైఎస్‌ఆర్ పార్టీ ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి వైఎస్‌ఆర్ పార్టీ నాయకులు బి.వి జగన్ అమర్నాథ్,ఎంపిటిసి పులి ప్రకాష్ రెడ్డి,గ్రామ సర్పంచ్ బోయ రామాంజనేయులు, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి,మిద్దెపురం సర్పంచ్ లాయర్ మహేశ్వర్ రెడ్డి కోటపాడు ఈశ్వర్ రెడ్డి పెద్దవెంతల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ చంద్రశేఖర్ రెడ్డి

శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతం : ఇఒ

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో మీడియా పాత్ర ఎంతో సహకరించిందని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, పాలక మండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డిలు కొనియాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆలయ ఈఓ మాట్లాడుతూ మహానంది పుణ్య క్షేత్రం అభివృద్ధిలో ఆలయ అధికారులతో పాటు పాలకమండలి సభ్యుల సహకారం, దాతల, మీడియా సహకారం ఎంతగానో తోడ్పాటునిచ్చిందన్నారు. దసరా శరన్నవరాత్రి పర్వదినాలకు గానూ ఆలయానికి గత సంవత్సరం 29 లక్ష 59 వేలు రాగా ఈ సంవత్సరం 39 లక్షల 73వేలు అంటే 10 లక్షల 14 వేల రూపాయలు ఆదాయం వచ్చినట్లుగా తెలిపారు. పాలకమండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కొత్త ట్రస్ట్ వచ్చాక ఆలయ పరిసరాలలో మార్పు తీసుకుని వచ్చామని ఎమ్మెల్యే సహకారంతో క్షేత్రాన్ని ఇంకా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని అందుకు మీడియా సహకారం అవసరమని అన్నారు. అనంతరం పాలక మండలి చైర్మన్ ,ఆలయ ఈవో, వేద పండితులు మీడియా మిత్రులను సత్కరించి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, పాలకమండలి చైర్మన్, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది,మీడియా మిత్రులు పాల్గొన్నారు.

యూత్ రెడ్‌క్రాస్‌లను విస్తరించాలి

- జూనియర్ యూత్ రెడ్ క్రాస్ చైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో యూత్ రెడ్‌క్రాస్‌లను విస్తరించాలి అని, రెడ్‌క్రాస్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని అందులో వాలంటీర్లుగా నమోదు చేసుకోవాలని జిల్లా యువతకు స్వచ్ఛంద సంస్థలకు అధికారులకు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. బుధవారం జూనియర్ యూత్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయం విసి హాల్‌లో జరిగిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జూనియర్ యూత్ రెడ్ క్రాస్ జిల్లా స్థాయి సబ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా అధికారులు జూనియర్ యూత్ రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు డీఈవో సుధాకర్ రెడ్డి, జిల్లా వైద్యశాఖ ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా కోపరేటివ్ అధికారి మరియు జిల్లా రెడ్ క్రాస్ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బయ్య, వివిధ కళాశాలల పాఠశాలల ప్రిన్సిపాల్ విద్యార్థులు ప్రకాశం జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనియర్ రెడ్ క్రాస్ యూత్ రెడ్ క్రాస్ జిల్లా కమిటీ చైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలో 8వ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థుల వరకు ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులతో జూనియర్ రెడ్ క్రాస్ కమిటీలు ఏర్పాటు చేయాలని అలాగే డిగ్రీ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాలలో ఇతర యూత్ క్లబ్ లో యూత్ రెడ్ క్రాస్ టీంలు ఏర్పాటు చేయాలన్నారు. యూత్/జూనియర్ రెడ్ క్రాస్ కమిటీలు మండల స్థాయిలో కూడా మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసుకోవాలని తద్వారా మారుమూల ప్రాంత విద్యార్థులతో సేవా కార్యక్రమాలైన రక్తదానంపై అవగాహన పచ్చదనం పరిశోధన పరిశుభ్రత పై అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రెడ్‌క్రాస్‌లో స్వచ్ఛందంగా సేవలందించాలనుకున్న ప్రతి ఒక్కరూ, విద్యార్థిని, విద్యార్థులు ,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువత, అధికారులు అందరూ రెడ్‌క్రాస్ యాప్ ప్లే స్టోర్లో డౌన్లోడ్ చేసుకొని వాలంటీర్లుగా నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పిటిసి

చెంచుల చదువుపై నిర్లక్ష్యమొద్దు

ఐటీడీఏ అధికారులు చెంచుల సమస్యలపై పనిచేయాలి : జడ్పిటిసి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గిరిజన చెంచుగూడెంలలో ఉన్న అడవి బిడ్డల చదువుపై నిర్లక్ష్యం వద్దని చెంచుల కోసం పనిచేస్తున్న ఐటీడీఏ అధికారులు చెంచుల సమస్యలపై పనిచేయకపోతే చెంచులు ప్రభుత్వ పథకాలకు దూరం అవుతున్నారని జడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీపీ కుసుమలత తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మేరీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న పలు శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో ఉన్న ప్రభుత్వ పథకా లను శాఖల వారీగా వివరించారు. అలాగే కొత్తపల్లి ఎంపీటీసీ అల్లి బాషా మాట్లాడుతూ చెంచులు పలు సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారు. చెంచుల భూములను మధ్య దళారులు అనుభవిస్తుంటే చెంచుల కోసం పనిచేసే ఐటీడీఏ అధికారులు చుట్టపు చూపుగా విధులు నిర్వహించడం బాధా కరమన్నారు. ముసలమడుగు సర్పంచ్ జమిలాబి మాట్లాడుతూ ముసలమ డుగు గ్రామంలో బీసీ కాలనీలో విద్యుత్ తీగలు కిందికి ఉన్నాయని సంబంధిత అధికారులు పట్టించుకోకపోతే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని సమస్యను పరిష్కరించాలి అన్నారు. అనంతరం ఎంపీపీ జడ్పిటిసి మాట్లాడుతూ అడవి బిడ్డల చదువులపై నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. అడవి బిడ్డలకు అక్షర జ్ఞానం నేర్పి భవిష్యత్తులో ప్రయోజకులు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. చంచెల సమస్యలపై పనిచేయాల్సిన ఐటీడీఏ అధికారులు చెంచు గూడెంలకు చుట్టపుచూపుగా వెళితే ఏమి ప్రయో జనమని మండిపడ్డారు. నేటికీ కొన్ని గూడెంలలో చెంచులకు ఆధార్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారంటే అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం నుంచి సిసి రహదారులు పలుభవనాలకు నిధులు మంజూరు అయితే వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు రాకపోవడం బాధాకరమ న్నారు. సంబంధిత అధికారులు ప్రతిపాదనలు ఎలా సిద్ధం చేయాలో నేర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. కృష్ణానది తీరం వెంట అల్వి వలలో సమాచారం సంబంధిత అధికారులకు ఇస్తే అధికారులు వస్తున్న సమయంలో అల్వి వలలో నిర్వాహకులకు తెలపడంతో వారిపై చర్యలు ఎలా తీసుకుం టారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, వైస్ ఎంపీపీలు సింగారం రంగ చిమ్మే జయమ్మ, ఏపీఎం పుల్లయ్య, ఏపీఓ రేష్మ, పంచాయతీరాజ్ రామచంద్రయ్య, మైనర్ ఇరిగేషన్ ఏఈఈ నాగన్న, రామ్మోహన్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి శ్రీరాములు, ఐసిడిఎస్ ఎసిడి పిఓ మంగవలి, వ్యవసాయ అధికారి మహేష్, పశువైద్యాధికారి భువనేశ్వరి, వైద్యాధికారి సౌజన్య లక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగేశ్వరమ్మ, అంజలి, ఐటీడీఏ ఏపీవో రాజు నాయక్, ఎంపీటీసీలు ముబీనా బేగ,ం రమీజాబి, శివన్న, స్రవంతి, సర్పంచులు నక్క విజయ్ కుమార్, బాల ఎల్లయ్య, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జ్యోతి స్వరూప్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

నిశ్చితార్థ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని తుమ్మలపెంట గ్రామం వైఎస్ఆర్ పార్టీ నాయకుడు యాతం పెద్దిరెడ్డి కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమానికి బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కొలిమిగుండ్ల మండల వైసిపి కన్వీనర్ అంబటి గురువి రెడ్డి బుధవారం హాజరయ్యారు. ఈ కార్యక్రమ ంలో తోట మల్లేశ్వర్ రెడ్డి, తుమ్మలపెంట ఉప సర్పంచ్ తోట శివశంకర్ రెడ్డి, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండేకంటి పాఠశాలలో

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ఇల్లూరు కొత్తపేట పెండేకంటి పబ్లిక్ స్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి పెండేకంటి బాలాజీ మాట్లాడుతూ 1982లో దూరదృష్టితో ఆలోచించి మాజీ గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్యను అందించేందుకు పాఠశాల స్థాపించడం జరిగిందన్నారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. అందరికీ విలువలతో కూడిన విద్యను అందించడమే పెండేకంటి పబ్లిక్ స్కూల్ లక్ష్యం అన్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్, సురేంద్రన్, హనుమంతరాయ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పరిపాలన అధికారి సురేష్ కుమార్, మాజీ ప్రధానోపాధ్యాయులు సాయి ప్రభాకర్ రెడ్డి, 300 మంది పూర్వ విద్యార్థులు, 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల జ్ఞాపకం అందజేస్తున్న దృశ్యం



డిఎస్పి శ్రీనివాసరావును సన్మానిస్తున్న నిర్వహకులు తదితరులు

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - ఆత్మకూర్

గ్రంథాలయాలు జ్ఞానాన్ని అందించే విజ్ఞాన కేంద్రాలు అని ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నాడు ఆత్మకూరు పట్టణానికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ శివరాం దాదాపు 300 పుస్తకాలను విరాళంగా ఇచ్చే కార్యక్రమానికి డిఎస్పి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ తను విద్యాభ్యాసం చేసే రోజుల్లో క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వెళ్లేవాడినని, అక్కడ తనకు అవసరమైన పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకున్నానని అన్నారు. ప్రతిఒక్కరూ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న విజ్ఞాన పుస్త కాలను చదివేందుకు సమయాన్ని కేటాయించాలని ఆయన సూచించారు. పుస్తకాల దాత శివరాం మాట్లాడుతూ ఈ గ్రంథాలయానికి ప్రముఖ వ్యక్తులు ముద్రించిన పుస్తకాలను సైన్స్ పుస్తకాలను కమ్యూనిస్టు పుస్తకాలను భక్తికి సంబంధించిన పుస్తకాలను దాదాపు 300 పుస్తకాలు గ్రంథాలయానికి అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు తిరుపతయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు పువ్వాడ భాస్కర్, జయకృష్ణ, గ్రంథాలయ అధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - రుద్రవరం

మండల పరిధిలోని ఆయా గ్రామ సచివాలయాలలో 2010 నుండి 2016 వరకు ఆధార్ కార్డులు పొందిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ అప్డేట్ చేయించుకోవాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆధార్ అప్డేట్ నమోదు శిబిరాలను గ్రామ సచివాలయాలలో ఏర్పాటు చేయడం జరిగిందని ఈనెల 25 నుండి 28 వరకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ రుసుముగా రూ.50 చెల్లించి తమ ఆధార్ అప్డేట్‌ను చేయించుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వం అందించే పథకాలను రద్దు చేయడమే కాక వారి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ ను రద్దు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. **మహానంది :** ఆధార్ అప్డేషన్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శివ నాగజ్యోతి తెలిపారు. మహానంది మండలంలోని గాజులపల్లె, అబ్బీపురం,తిమ్మాపురం, తమ్మడపల్లె గ్రామాల్లోని సచివాలయాల్లో ఈనెల 25,26,27,28 తేదీలలో ఆధార్ అప్డేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు.

ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయండి : ఎఐటియుసి

ప్రజాశక్తి - బనగానపల్లె

ఈనెల 31వ తేదీన నిర్వహించే ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివ బాలకృష్ణ కోరారు. బుధవారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి శివ బాలకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటిసి బనగానపల్లె నియోజక



నగదును అందిస్తున్న కౌన్సిలర్ ఆర్ట్ రమణ

వైఎస్ఆర్ బీమా పేదలకు అండ

ప్రజాశక్తి-డోన్

వైఎస్ఆర్ బీమా పేదలకు అండగా నిలుస్తుందని 30వ వార్డు కౌన్సిలర్ ఆర్ట్ రమణ అన్నారు. బుధవారం డోన్ పట్టణంలోని 30 వార్డులో 'మన వార్డు మన బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస టాకీస్ దగ్గర,నివాసం ఉంటున్న ఎరుకల రాము పసిరికలతో చనిపోవడం జరిగిందని భార్య కమలామణికి వైయస్సార్ బీమా కింద మట్టి ఖర్చులకు రూ.10,000 అందించడం జరిగిందన్నారు. మిగతా రూ.90000 కమలామణి అకౌంట్లో నేరుగా జమ అవుతాయన్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కౌన్సిలర్ ఆర్ట్ రమణకు రాము భార్య కమలామణి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ అలివేలు,వాలంటీర్ ఈశ్వరి, కుల్లాయి, శకుంబి తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్** : మున్సిపాలిటీ పరిధిలోని హాజీ నగర్ 27వ వార్డు నందు మృతి చెందిన పద్మావతమ్మ కుటుంబ సభ్యులకు వైయస్ఆర్ బీమా తక్షణ సాయం ద్వారా రూ.10,000లను వైసిపి జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ ఉస్మాన్ బేగ్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డువేల్ఫేర్ అసిస్టెంట్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని అన్ని గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని ఎంపీపీ బుగ్గన నాగ భూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, వైసీపీ నాయకులు బాబుల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని తవిసికొండ గ్రామంలో సుమారు రూ.7 లక్షలతో పూర్తయిన రైతుల పొలాల రహదారిని ఎంపీపీ, నాగభూషణం రెడ్డి, చైర్మన్ చలం రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి రాజేంద్రనాథరెడ్డి చొరవతో మండలంలోని అన్ని గ్రామాల రైతుల పొలాలకు వెళ్లడానికి రహదారు లను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు మం డల కన్వీనర్ కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, మసి రామా నాయుడు,చిట్టే జగదీశ్వర్ రెడ్డి, తిరుపం రెడ్డి, బాలనాగయ్య, పాపసాని వెంకటేశ్వర్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, ఉత్తపై మద్దిలేటి, చాకలి శ్రీరాములు, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తవిసికొండ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణ్ రెడ్డి

వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మఠం ప్రతినిధి సంపత్, ఓఎస్డి శివప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, కమ్యూనికేషన్ అధికారి సేతురామన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ఉత్సవాలలో ఉత్సవమూర్తులైన శ్రీ జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పవిత్రలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అర్చకుల వేదమంత్రాల నడుమ హెూమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఏడాది పొడవునా స్వామి వారికి జరిగిన పూజల్లో లోపాల నివారణార్థం ఈ పవిత్ర ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 24 నుండి ప్రారంభమైన ఉత్సవాలు 27తో ముగుస్తాయని మఠం అధికా రులు తెలిపారు. దిగువ అహోబిలంలో 27న ప్రారంభమై పవిత్ర ఉత్సవాలు నవంబర్ 1న ముగుస్తాయన్నారు.

ముగిసిన దసరా నవరాత్రి ఉత్సవాలు

దసరా నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఉదయం జరిగిన వసంతోత్సవాలతో ఘనంగా ముగిశాయి. కాళికా మాత ఆలయ కమిటీ అధ్యక్షులు, శిల్పి దురుగడ్డ రవీంద్రాచార్యులు ఆధ్వర్యంలో ఈనెల 15 నుండి 24వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రతిరోజు కాళికామాత అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి రకరకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



ఎగువ అహోబిలంలో హెూమం నిర్వహిస్తున్న దృశ్యం



వసంతోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయండి : సిపిఎం

(5వ పేజీ తరువాయి...)

నంద్యాల పట్టణంలో 31న నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. **పాములపాడు :** సిపిఎం చేపట్టిన రక్షణ బేరి జాతాను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సామన్న, రైతు సంఘం కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు ఎస్ఆర్ రమణ, బాల యేసు, రంగస్వామి, ఆంజనేయులు కోరారు. పాములపాడులో సామన్న, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. ప్రజా వ్యతిరే విధానాలను ఎండగడుతూ చేపట్టిన బస్సు జాతా ఈ నెల 31న ఆత్మకూరుకు చేరుకొనుందని ప్రజలందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. **బేతంచెర్ల :** ఈనెల 31న నంద్యాలలో జరుగు ప్రజారక్షణ భేరి బస్సు జాతాను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వై ఎల్లయ్యలు కోరారు. స్థానిక మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయం నందు సిఐటియు పట్టణ కార్యదర్శి సంజీవ నాయుడు అధ్యక్షతన కార్మిక సంఘాల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 'ప్రజా రక్షణ భేరి'లో భాగంగా రాష్ట్రస్థాయి బస్సు జాత నంద్యాల పట్టణానికి వస్తుందని, మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు బహిరంగ సభ నిర్వహించబడుతుందని, జయప్రదం చేయవలసిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు నాయకులు బి రామాంజ నేయులు, బి సంజీవ నాయుడు, ఎన్. నాగేషు, ఎస్ గుల్జార్ బి, సిహెచ్ మదిలేటి స్వామి, ఏ మద్దిలేటి స్వామి, మళ్లీ, లక్ష్మన్న, డి రాజు, సుబ్బయ్య, రామల్లకోట బాష, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



పాములపాడు : మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఎపి మోడల్ స్కూళ్ల నూతన ప్రిన్సిపల్స్ భాధ్యతలు



కొలిమిగుండ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.సంజీవరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల ఎపి మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా కె.సంజీవరెడ్డి బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. కె.సంజీవరెడ్డి సిరివెళ్ల మండలంలోని మోడల్ స్కూల్లో మ్యాస్ పిజిటి పనిచేస్తూ పదోన్నతిలో భాగంగా కొలిమిగుండ్లకు నూతన ప్రిన్సిపాల్‌గా వచ్చారు. ఆంగ్ల అధ్యాపకులుగా గోవిందు, అర్ధశాస్త్ర అధ్యాపకులుగా దాదాపీర్ నియమితులైనట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.చంద్రసేనారెడ్డి తెలిపారు. మోడల్ స్కూల్‌కు పూర్తిగా అందరూ టీచర్స్ ఉన్నారని 100 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలోనే ఆదర్శంగా నిలిచేట్లు కృషి చేస్తామని నూతన ప్రిన్సిపాల్ కె.సంజీవరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా పదోన్నతిపై నూతనంగా విచ్చేసిన ప్రిన్సిపల్‌ను, ఇతర అధ్యాపకులను మిగిలిన అధ్యాపక అధ్యాపకేతర బృందం శాలువా, పూలమాలతో సత్కరించి ఘనంగా ఆహ్వానం పలికారు. **బేతంచర్ల :** మండలంలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా మరియదాసు బుధవారం పదవీభాధ్యతలు చేపట్టారు. ఏపీ మోడల్ స్కూల్‌కు జరిగినటువంటి ప్రమోషన్ జాబితాలో పిజిటి ఎకనామిక్స్‌గా బండి ఆత్మకూర్ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న టి మరియ దాసు రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా ప్రమోషన్ పొంది బేతంచెర్ల మోడల్ స్కూల్ కు పూర్తిస్థాయి ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. కొత్తగా వచ్చిన ప్రిన్సిపల్‌కి ఉపాధ్యాయులంతా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన స్టాఫ్ మీటింగ్‌లో ఘనంగా సన్మానించారు. పేద పిల్లల అభ్యున్నతి కోసం నేను కృషి చేస్తానని ప్రిన్సిపల్ మరియదాసు తెలిపారు. ఇంచార్జి ప్రిన్సిపల్ గంగుల నాగరాజు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను చేసే మిత్రుడు పూర్తిస్థాయి ప్రిన్సిపాల్ రావడం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయ బృందం, నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గంగమ్మ ఒడికి జగన్మాత

ప్రజాశక్తి - బేతంచెర్ల

శరన్నవరాత్రులు మహిషాసుర మర్దిని అమ్మ వారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి భక్తులు జగన్మాతను 9వ రోజు కర్నూలు రోడ్డు అయ్యల చెరువులో గల వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేయడం జరిగింది. బేతంచెర్ల పట్టణ పురవీధుల గుండా చిన్నలో పెద్దలు భక్తులు అమ్మవారి విగ్రహాలను ఊరేగిస్తూ చిన్న పిల్లల కోలాటం, డప్పు వాయిద్యాలతో, వివిధ వేషధారనలతో ఊరేగింపు చేశారు. దుర్గమ్మ అమ్మవారి విగ్రహాల ముందు నంద్యాల కళాకా రుల వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమ ంలో బేతంచెర్ల పట్టణంలోని సంజీవ నగర్‌లోని అమ్మవారి విగ్రహంతో పాటు, కళాకారుల వేషధారణ ఎంతో ఆకర్షణగా ఈ కార్యక్రమంలో బేతంచర్ల పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



అమ్మవారి విగ్రహాలను నిమజ్జనంకు తీసుకెళ్తున్న దృశ్యం



అమ్మవారి వేషాధారణలతో నాట్యం చేస్తున్న కళాకారిని

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ఎద్దుల పాపమ్మ కళాశాల ఆవరణంలో శిరిడి సాయి కళా సమితి ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకొని మంగళ వారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున వరకు జరిగిన పౌరాణిక నాటక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. చింతామణి, సత్య హరిచంద్ర నాటకం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలైన సీనియర్ కళాకారిణి అపర్ణ, హార్మోనిస్టు కృష్ణను లలిత కళా సమితి వ్యవస్థాపకులు బిజ్జం వెంకటేశ్వర్ రెడ్డి సన్మానం నిర్వహించి వస్త్రాలు సమర్పించారు. అలాగే సన్మాన గ్రహీతలను సీనియర్ కళాకారుడు దేవ సహాయం, నాగేశ్వరుడు, గ్యాస్ పుల్లయ్య, కృష్ణయ్య, పకీరయ్య, కృష్ణారెడ్డి, నరసింహుడు, శేఖర్ తదితరులు అభినందించారు.



29 వరకు సామాజిక తనిఖీల ముసాయిదా ప్రదర్శన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో ఖరీఫ్ -2023 సీజన్ లో 5,51,912 ఎకరాలలో పంటల సాగు ఈ-క్రాప్ పూర్తిచేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామాలలో అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ నెల 26 వ తేదీ నుండి 29 వరకు ఈ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శిం చడబడుతుందని, గ్రామ సభలు నిర్వహించబడతాయన్నారు. ముసాయిదా జాబితాలో వున్న రైతుల క్రాప్ నమోదు అన్నీ వివరములను సమగ్రముగా చదివి వినిపించడం జరుగుతుందని తెలిపారు. కావున రైతు సోదరులు ఆయా రైతు భరోసా కేంద్రంలో సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించబడిన ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరములు ఏమైనా ఉన్నట్లైతే సవరణ కొరకు మీ రైతు భరోసా కేంద్రములో వున్న వి.ఏ.ఏ, వి.హెచ్.ఏ, వి.ఎస్.ఏలను సంప్రదించి అభ్యంతరములు తెలపాలన్నారు. ఈ క్రాప్ ఖరీఫ్ 2023 సీజన్ సవరణ కొరకు ఇది ఆఖరి అవకాశమని తుది జాబితా ప్రదర్శన తరువాత ఎటువంటి మార్పులు, చేర్పులు చేయబడవని డిఏఓ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.